
JAYABHERIDAILY.COM
తెలుగు దినపత్రిక
# ప్రభాత జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజిగిరి | శనివారం 20-12-2025
Medchal - Malkajgiri | Saturday 20-12-2025
jayabherinews
సంపుటి : 02 | సంచిక : 204 | పేజీలు : 8 | వెల : 5
Vol. 02 | Issue 204 | Pages : 8 | ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me
jayabheripaper@gmail.com

## తెలంగాణ భవన్‌కు గులాబీ బాస్..!

- చాలా గ్యాప్ తర్వాత మళ్లీ కారెక్కనున్న కేసీఆర్..
- కొంతమేరకు అనారోగ్య కారణాలైతే.. మరికొంత అనాసక్తి కూడా కారణం..!
- నీటి వాటాల విషయంలో మరో ఉద్యమానికి తెర తీస్తారా?

జయభేరి, హైదరాబాద్ :

**మళ్లీ యాక్టివ్ అవుతున్నారు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్. ఇప్పటివరకు ఒకే ఎత్తు ఇకనుంచి తెలంగాణ రాజకీయాల్లో మరో ఎత్తు అంటున్నారు బీఆర్ఎస్ కార్యకర్తలు. తెలంగాణ రాజకీయాల్లో కేసీఆర్ వెరీ వెరీ స్పెషల్. ఆయన స్పీచ్‌కు లక్షల్లో వ్యూయర్స్ ఉంటారు. తెలంగాణ ఉద్యమం నుంచి ముఖ్యమంత్రి హోదా వరకు అన్ని పదవుల్లోనూ ఆయన స్టైల్ వేరు. అలాంటి కేసీఆర్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత గత రెండేళ్లుగా సైలెంట్‌గా ఉండిపోయారు. కొంతమేరకు అనారోగ్య కారణాలైతే.. మరికొంత అనాసక్తి కూడా కారణం..!**

ఈ ఏడాది మార్చి నెలలో చివరిసారిగా ఆయన పార్టీ ఆఫీస్ తెలంగాణ భవన్ వచ్చారు. ఇక ప్రెస్ మీట్ పెట్టి ఏడాది దాటుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే రెండేళ్లు సమయం ఇస్తానంటూ చెప్పిన కేసీఆర్, ఇప్పుడు మళ్లీ రంగంలోకి దిగనున్నట్లు సంకేతాలు ఇచ్చారు. ఆదివారం (డిసెంబర్ 21) తెలంగాణ భవన్‌లో నేతలతో సమావేశం ఏర్పాటు చేశారు. పాలమూరు ప్రాజెక్ట్ నీటి కేటాయింపులపై ఉద్యమం చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం గత రెండు రోజులుగా ఫామ్ హౌస్ లో నేతలతో చర్చలు జరుపుతున్నారు కేసీఆర్. ఇప్పటికే కేసీఆర్ బయటకు రావాలి.. అసెంబ్లీలో చర్చల్లో పాల్గొనాలి అంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పదేపదే సెటైర్లు వేస్తున్నారు. పాలమూరు నీటి కేటాయింపుల విషయంలోనూ కేంద్రానికి రెండు పార్టీలు లేఖ రాద్దాం.. అసెంబ్లీలో చర్చిద్దాం.. రమ్మంటూ వెల్‌కమ్ కూడా చెప్పారు. ఇప్పుడు కేసీఆర్ ఆదివారం తెలంగాణ భవన్ సమావేశంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటారు..? నీటి వాటాల విషయంలో మరో ఉద్యమానికి తెర తీస్తారా? అనేది ఆసక్తిగా మారింది. మీటింగ్ తర్వాత ప్రెస్ మీట్ పెడతారా..? ప్రెస్ మీట్ లో ఎలాంటి మాటలు మాట్లాడతారు? ఎలాంటి ప్రకటనలు చేస్తారనేది కూడా వెరీ ఇంట్రెస్టింగ్ గా కనిపిస్తుంది. ఇక వీటన్నిటితో పాటు రాజకీయ అంశాలు మాట్లాడాల్సి వస్తే, కవితపై కూడా స్పందిస్తారనేది పార్టీలో చర్చ జరుగుతుంది.



# స్పీకర్ సమక్షంలో చాయ్ పే చర్చ

*పార్లమెంట్ శీతాకాల సమావేశాలు నేటితో ముగిశాయి. సమావేశాల నిరవధిక వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే పార్లమెంటు సభ్యులకు స్పీకర్ ఓం బిర్లా తేనీటి విందు ఇచ్చారు. ఇందులో ప్రధాని నరేంద్ర మోదీ, కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ, కేంద్రమంత్రులు రాజ్‌నాథ్ సింగ్, రామ్మోహన్ నాయుడు, పలువురు అఖిలపక్ష ఎంపీలు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ప్రియాంక నియోజకవర్గం వయనాడ్ గురించి మోదీ చర్చించినట్లు తెలుస్తోంది.*

- హాజరైన ప్రధాని మోదీ, ప్రియాంకా గాంధీ

జయభేరి, న్యూఢిల్లీ:

పార్లమెంటు శీతాకాల సమావేశాలు నిరంతరం గందరగోళం, వాడివేడి చర్చలు, వాకౌట్లు, నిరసనలతో ముగిశాయి. సమావేశాల చివరి రోజున లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా నిర్వహించిన సాంప్రదాయ " టీ పార్టీ " రాజకీయ వేడిని క్లుప్తంగా తగ్గించింది. విశేషమేమిటంటే, గతసారిలా కాకుండా, ప్రతిపక్ష ఎంపీలు కూడా టీ పార్టీలో చేరారు. ఈ సమావేశాన్ని చాలా స్నేహపూర్వకంగా ముగించారు. దాదాపు మూడు వారాల పాటు ఆరోపణలు, ప్రత్యారోపణల తర్వాత, పార్లమెంటు సభ్యులు అనధికారికంగా చర్చించుకునే అవకాశం దొరికింది. ప్రతి సంవత్సరం పార్లమెంటు సమావేశం తర్వాత ఉద్రిక్త వాతావరణాన్ని తగ్గించడానికి స్పీకర్ " టీ పార్టీ " నిర్వహిస్తారు. ఈసారి కాంగ్రెస్ తరపున ప్రియాంక గాంధీ వాద్రా కూడా పాల్గొన్నారు. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ లేనప్పుడు ప్రియాంక గాంధీ ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీకి నాయకత్వం వహించారు. లోక్‌సభ స్పీకర్ కార్యాలయం షేర్ చేసిన ఫోటోలలో ప్రియాంక గాంధీ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఓం బిర్లాతో

...మిగతాది 2 లో



2 లో

## దేవుడి విషయంలోనూ మాట తప్పిన రేవంత్ రెడ్డి

- అయోధ్య కన్నా కూడా భద్రాచల రాముల వారి చరిత్రే గొప్పది
- భద్రాచలం టెంపుల్ ను అభివృద్ధి చేసే మనసు బీజేపీకి రావటం లేదు
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

## ఢిల్లీలో కేంద్ర మంత్రులతో చంద్రబాబు


- అదనపు నిధుల కోసం ఆర్థిక మంత్రితో చర్చలు
- పోలవరం-నల్లమల సాగర్ ప్రాజెక్టుకు ఆర్థిక చేయూతనివ్వాలి
- సాస్కీ పథకం కింద రెండో విడతగా రూ. 10,054 కోట్లు మంజూరు చేయాలి
- రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మార్చేందుకు రూ. 41 వేల కోట్లతో ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని విజ్ఞప్తి
- బీజేపీ కొత్త జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నితిన్ నబీన్ సిన్హాను కలిసిన చంద్రబాబు



జయభేరి, విజయవాడ, డిసెంబర్ 19 :

ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటన అత్యంత బిజీగా సాగుతోంది. రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా ఆయన ఒక్కరోజే ఆరుగురు కేంద్ర మంత్రులతో వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. విభజన హామీలు, పెండింగ్ నిధులు, కొత్త మౌలిక సదుపాయాల ప్రాజెక్టులపై కేంద్రంతో ఆయన జరుపుతున్న చర్చలు కీలక దశకు చేరుకున్నాయి. శుక్రవారం ఉదయం నుంచే ఆయన వరుసగా కేంద్ర మంత్రులతో భేటీ అవుతూ ఏపీకి రావాల్సిన నిధులు, ప్రాజెక్టులపై

...మిగతాది 2 లో



## రూ. 8.6 కోట్లు ఇస్తే హనీమూన్ ఎవరికి కావాలి?

- హనీమూన్ వాయిదా..?
- పంజాబ్ కింగ్స్ ఆగ్రహం..
- కావ్య వర్సెస్ గోయెంకా వార్‌లో బిగ్గెస్ట్ డ్రామా

జయభేరి, హైదరాబాద్ :

ఆస్ట్రేలియా వికెట్ కీపర్ బ్యాటర్ జోష్ ఇంగ్లిస్ ఐపీఎల్ 2026 వేలంలో హాట్ టాపిక్‌గా మారారు. కేవలం నాలుగు మ్యాచ్‌లకు మాత్రమే అందుబాటులో ఉంటానని ముందే ప్రకటించినప్పటికీ, అతని కోసం ఫ్రాంచైజీలు కోట్లు కుమ్మరించడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. ముఖ్యంగా అతను తన హనీమూన్‌ను వాయిదా వేసుకుని ఐపీఎల్ కోసం రానున్నాడనే వార్తలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

...మిగతాది 2 లో

## ఆయుధాలతో సహా లొంగిపోయిన మావోయిస్టు


- డీజీపీ శివధర్ రెడ్డి సమక్షంలో ఆయుధాలతో సహా లొంగిపోయిన 41 మంది మావోయిస్టు

జయభేరి, హైదరాబాద్, డిసెంబర్ 19 :



నిషేధిత సీపీఐ (మావోయిస్టు) పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి సమక్షంలో 41 మంది మావోయిస్టు ఆయుధాలతో సహా లొంగిపోయారు. వీరిలో PLGA బటాలియన్, వివిధ డివిజనల్, ఏరియా కమిటీ స్థాయి నాయకులు కూడా ఉన్నారు. మొత్తం 24 ఆయుధాలు, 733 తూటాలు, 8 బీజీఎల్ షెల్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. లొంగిపోయిన మావోయిస్టుల్లో ఇద్దరు తెలంగాణ వాళ్లు ఉండటం గమనార్హం.పోలీసుల వివరాల ప్రకారం.. లొంగిపోయిన వారిలో ఆరుగురు డివిజనల్/కంపెనీ స్థాయి కమిటీ సభ్యులు, 12 మంది ఏరియా/ప్లాటూన్ కమిటీ సభ్యులు, 23 మంది సాధారణ పార్టీ సభ్యులు ఉన్నారు. ఇన్సాస్ ఎల్ఎంజీ, ఏకే-47, ఎస్ఎల్ఆర్, ఇన్సాస్ రైఫిళ్లు, .303 రైఫిళ్లు తదితర ఆయుధాలు లొంగుబాటులో భాగంగా అప్పగించారు. మావోయిస్టు పార్టీలో సంస్థాగత బలహీనత, నాయకత్వంపై నమ్మకం తగ్గడం, అడవుల్లో తీవ్ర జీవన కష్టాలు, భద్రతా బలగాల ఒత్తిడి కారణంగానే తాము ప్రధాన జనజీవనంలోకి రావాలని నిర్ణయించుకున్నట్లు లొంగిపోయిన మావోయిస్టులు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన పిలుపుకు స్పందనగా ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు.లొంగిపోయిన వారికి రాష్ట్ర పునరావాస విధానం ప్రకారం

...మిగతాది 2 లో




## ఎయిర్‌పోర్టులపై రూ.1 లక్ష కోట్ల పెట్టుబడి పెట్టనున్న అదానీ గ్రూప్

జయభేరి, న్యూఢిల్లీ:

గౌతమ్ అదానీ నేతృత్వంలోని అదానీ గ్రూప్ రాగల ఐదేళ్లలో ఎయిర్‌పోర్టుల పై లక్ష కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టాలని యోచిస్తోంది. ఏవియేషన్ సెక్టార్ ఏటా 15 నుంచి 16 శాతం వృద్ధి నమోదు

...మిగతాది 2 లో

మొదటిపేజీ తరువాయి

## స్పీకర్ సమక్షంలో చాయ్ పే చర్చ

కలిసి కూర్చున్న చిత్రాలు వైరల్‌గా మారాయి. దాదాపు 20 నిమిషాల పాటు సాగిన ఈ భేటీలో సమాజ్‌వాదీ పార్టీకి చెందిన ధర్మేంద్ర యాదవ్, ఎన్‌సిపి (ఎస్పీ) కి చెందిన సుప్రియా సులే , సిపిఐ నాయకుడు డి. రాజా కూడా పాల్గొన్నారు. ఈ సమావేశంలో చాలా సరదా క్షణాలు గడచాయి. అలెర్జీలను నివారించడానికి తన పార్లమెంటరీ నియోజకవర్గం వయనాడ్ నుండి ఒక మూలికను తీసుకుంటానని ప్రియాంక గాంధీ చెప్పినట్లు సమాచారం. దీంతో ప్రధాని మోదీ, రాజ్‌నాథ్ సింగ్ ఇద్దరూ చిరునవ్వులు చిందించాయి. ఇటీవల ఇథియోపియా, జోర్డాన్, ఒమన్ దేశాలకు చేసిన పర్యటనల గురించి ప్రియాంక గాంధీ ప్రధాని మోదీని అడిగారు. దానికి ప్రధాని మోదీ పర్యటన బాగుందని బదులిచ్చారు. ఈ సందర్భంగా ధర్మేంద్ర యాదవ్ పార్లమెంటు సమావేశాలను మరికొంతసేపు పొడిగించాల్సిందని సూచించారు. మీ గొంతు నొప్పిని తగ్గించడానికి సమావేశాన్ని తగ్గించి ఉంటారని ప్రధాని చమత్కరించారు.

ఈ వ్యాఖ్య ఎంపీలలో నవ్వులు పూయించింది. ఎన్.కె. ప్రేమచంద్రం సహా కొంతమంది ప్రతిపక్ష ఎంపీలు సభలో అద్భుతంగా సిద్ధమయ్యారని ప్రధాని మోదీ ప్రశంసించారు. గత వర్షాకాల సమావేశాల తర్వాత రాహుల్ గాంధీ ఇలాంటి టీ పార్టీని బహిష్కరించినందున ఈ టీ పార్టీకి ప్రియాంక గాంధీ హాజరు కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఆ సమయంలో, అనేక ప్రతిపక్ష పార్టీలు కూడా గైర్హాజరయ్యాయి. లోక్‌సభ స్పీకర్ తమకు మాట్లాడే అవకాశం నిరాకరిస్తున్నారని ప్రతిపక్షం ఆరోపించింది. ఈ నిర్ణయాన్ని ప్రధాని మోదీ కూడా విమర్శించారు. ఈ సారి అందరు ప్రతిపక్ష ఎంపీలు టీ పార్టీకి హాజరు కావాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే నిర్ణయించారని వర్గాలు తెలిపాయి. శీతాకాల సమావేశాల్లో ప్రతిపక్షాల పట్ల స్పీకర్ ఓం బిర్లా న్యాయమైన వైఖరిని పాటించడమే దీనికి కారణమంటున్నారు విశ్లేషకులు.

## రూ. 8.6 కోట్లు ఇస్తే.. హనీమూన్ ఎవరికి కావాలి?

**హనీమూన్ వాయిదా..?**

జోష్ ఇంగ్లిస్ వివాహం 2026 ఏప్రిల్ 18న జరగనుంది. ఈ కారణంగానే అతను ఐపీఎల్ సీజన్ మొత్తానికి అందుబాటులో ఉండలేనని, కేవలం 4 మ్యాచ్‌లే ఆడుతానని గతంలోనే బీసీసీఐకి, ఫ్రాంచైజీలకు సమాచారం ఇచ్చాడు. అయితే, వేలంలో లక్నో సూపర్ జెయింట్స్ అతనికి రూ. 8.6 కోట్లు భారీ ధరను ఆఫర్ చేయడంతో ఇప్పుడు సమీకరణాలు మారాయి.తాజా సమాచారం ప్రకారం, ఇంత భారీ ధర దక్కడంతో ఇంగ్లిస్ తన హనీమూన్ ప్లాన్స్‌ను వాయిదా వేసుకోవాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. పెళ్లి కోసం చిన్న విరామం తీసుకుని, ఆ వెంటనే మళ్ళీ లక్నో జట్టుతో చేరే అవకాశం ఉంది.

**కావ్య మారన్ vs సంజీవ్ గోయెంకా..**

అబుదాబిలో జరిగిన వేలంలో ఇంగ్లిస్ కోసం సన్‌రైజర్స్ హైదరాబాద్ (SRH) యజమాని కావ్య మారన్, లక్నో సూపర్ జెయింట్స్ (LSG) యజమాని సంజీవ్ గోయెంకా మధ్య హోరాహోరీ పోరు జరిగింది.

కావ్య మారన్ రూ. 8.40 కోట్ల వరకు బిడ్ వేయగా, చివరకు లక్నో రూ. 8.60 కోట్లకు అతన్ని దక్కించుకుంది. కేవలం 4 మ్యాచ్‌లు ఆడే ప్లేయర్ కోసం ఇంత ధర పెట్టడంపై నెటిజన్లు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఒకవేళ అతను హనీమూన్ వాయిదా వేసుకుని ఎక్కువ మ్యాచ్‌లు ఆడితే లక్నోకు అది పెద్ద ప్లస్ అవుతుంది.

**పంజాబ్ కింగ్స్ ఆగ్రహం..**

జోష్ ఇంగ్లిస్ వ్యవహారంపై అతని పాత ఫ్రాంచైజీ పంజాబ్ కింగ్స్ (PBKS) తీవ్ర అసహనం వ్యక్తం చేస్తోంది. పంజాబ్ కో-ఓనర్ నెజ్ వాడియా మాట్లాడుతూ.. ఇంగ్లిస్ ప్రవర్తన "అన్ ప్రొఫెషనల్" గా ఉందని విమర్శించారు. రిటెన్షన్ డెడ్ లైన్‌కు కేవలం 45 నిమిషాల ముందు మాత్రమే తాను అందుబాటులో ఉండనని ఇంగ్లిస్ చెప్పాడని, అందుకే అతన్ని వదిలేయాల్సి వచ్చిందని వాడియా పేర్కొన్నారు. తీరా వేలంలోకి వచ్చి ఎక్కువ మ్యాచ్‌లు ఆడుతానని చెప్పడం పంజాబ్‌ను విస్మయానికి గురిచేసింది. లక్నో హెడ్ కోచ్ జస్టిన్ లాంగర్‌తో ఇంగ్లిస్‌కు ఉన్న సాన్నిహిత్యం వల్లే లక్నో ధైర్యంగా అతనిపై అంత భారీ పందెం కాసిందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఏది ఏమైనా, 8.6 కోట్ల కోసం ఇంగ్లిస్ తన వ్యక్తిగత ప్లాన్స్‌ను మార్చుకోవడం ఐపీఎల్ క్రేజ్‌కు అద్దం పడుతోంది.

## ఢిల్లీలో కేంద్ర మంత్రులతో చంద్రబాబు

వినతులు సమర్పిస్తున్నారు. ఈ పర్యటనలో ఆయన వెంట ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు. ముందుగా కేంద్ర జల్‌శక్తి మంత్రి సి.ఆర్. పాటిల్‌తో చంద్రబాబు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనుల వేగవంతం, నిధుల విడుదలపై చర్చించారు. ముఖ్యంగా కర్ణాటక ప్రభుత్వం ఆల్మట్టి ఆనకట్ట ఎత్తు పెంచే ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ, దీనివల్ల ఏపీకి జరిగే నష్టాన్ని కేంద్రానికి వివరించారు. ఈ విషయంలో కేంద్రం జోక్యం చేసుకోవాలని కోరారు. ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని అదనపు నిధుల కోసం ఆర్థిక మంత్రితో చర్చలు జరిపారు.

సాస్కీ పథకం కింద రెండో విడతగా రూ. 10,054 కోట్లు మంజూరు చేయాలని, రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మార్చేందుకు రూ. 41 వేల కోట్లతో ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే పోలవరంనల్లమల సాగర్ ప్రాజెక్టుకు ఆర్థిక చేయూతనివ్వాలని కోరారు. కేంద్ర ఓడరేవుల శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్‌తో భేటీ అయిన చంద్రబాబు.. రాష్ట్రంలో నూతన షిప్పింగ్ ప్రాజెక్టులు, మేజర్ ఫిషింగ్ హార్బర్ల అభివృద్ధిపై చర్చించారు. కేంద్రరాష్ట్ర భాగస్వామ్యంతో ఏపీ తీర ప్రాంతాన్ని పారిశ్రామికంగా ఎలా బలోపేతం చేయవచ్చో వివరించారు. బీజేపీ కొత్త జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నితిన్ నబీన్ సిన్హాను కూడా చంద్రబాబు కలిసి అభినందించారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో విభజన సమస్యలు, శాంతి భద్రతల అంశాలపై చర్చించనున్నారు. నితిన్ గడ్కరీ జాతీయ రహదారుల విస్తరణ, రాష్ట్రంలో కొత్త హైవేల మంజూరుపై కీలక చర్చలు జరపనున్నారు. ఈ పర్యటన ముగించుకుని చంద్రబాబు నాయుడు ఇవాళే అమరావతికి తిరిగి చేరుకుంటారు. శనివారం అనకాపల్లి జిల్లాలో జరిగే స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొని, అనంతరం మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు.

## ఆయుధాలతో సహా లొంగిపోయిన మావోయిస్టు

డివిజనల్ కమిటీ సభ్యులకు రూ.5 లక్షలు, ఏరియా కమిటీ సభ్యులకు రూ.4 లక్షలు, పార్టీ సభ్యులకు రూ.లక్ష చొప్పున ప్రోత్సాహకం అందించనున్నారు. ఆయుధాలపై అదనపు రివార్డు కూడా ఇవ్వనున్నారు. మొత్తంగా రూ.1.46 కోట్లకు పైగా నగదు ప్రోత్సాహకాలు లభించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ లొంగుబాటుతో తెలంగాణలో మావోయిస్టు కార్యకలాపాలు మరింత బలహీనపడతాయని, మిగిలిన అజ్ఞాత కేడర్లు కూడా హింసను వీడి జనజీవనంలోకి రావాలని పోలీసులు పిలుపునిచ్చారు.

## ఎయిర్‌పోర్టులపై రూ.1 లక్ష కోట్ల పెట్టుబడి పెట్టనున్న అదానీ గ్రూప్

చేయనుందన్న అంచనాల నేపథ్యంలో అదానీ గ్రూప్ ఎయిర్‌పోర్టులపై భారీ పెట్టుబడులకు ప్లాన్ చేసింది. ఈ విషయాన్ని గౌతమ్ అదానీ చిన్న కుమారుడు, అదానీ ఎయిర్‌పోర్ట్స్ డైరెక్టర్ జీత్ అదానీ వెల్లడించారు. అదానీ గ్రూప్ ఈ నెల 25న నవీ ముంబై ఎయిర్‌పోర్టులో కమర్షియల్ ఆపరేషన్స్ ప్రారంభించనుంది. ఈ నేపథ్యంలో ఎయిర్‌పోర్టుల్లో లక్ష కోట్ల పెట్టుబడులు పెట్టబోతున్నామని అదానీ గ్రూప్ ప్రకటించింది. అదానీ గ్రూప్ ఎక్స్‌పాండింగ్ పోర్టుఫోలియోలో నవీ ముంబై అంతర్జాతీయ విమానాశ్రయం కొత్తగా చేరుతోంది. ఈ ఎయిర్‌పోర్టును నవీ ముంబై ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు లిమిటెడ్ అభివృద్ధి చేసింది. నవీ ముంబై ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు లిమిటెడ్ లో అదానీ గ్రూప్‌కు 74 శాతం వాటా ఉంది. ఈ ఎయిర్‌పోర్టును ప్రాథమికంగా రూ.19,650 కోట్ల వ్యయంతో, ఏడాదికి రెండు ప్రయాణికుల కెపాసిటీతో నిర్మించారు. తర్వాత దీన్ని ఏడాదికి 9 కోట్ల మంది ప్రయాణికుల కెపాసిటీకి విస్తరించనున్నారు.

# తెర పైకి హెరాల్డ్ రగడ

దేశ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారి తీసిన అంశాల్లో నేషనల్ హెరాల్డ్ కేసు ఒకటి. కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలను లక్ష్యంగా చేసుకుని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ద్వారా బీజేపీ రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆ పార్టీ ఆరోపణలు చేసింది. ఢిల్లీలోని రోజ్ అవెన్యూ కోర్టు కేసు విచారణ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేసింది. ఒక ప్రైవేటు వ్యక్తి చేసిన ఫిర్యాదు ఆధారంగా ఈడీ దాఖలు చేసిన చార్జ్‌షీట్‌ను పరిగణలోకి తీసుకోలేమని కోర్టు తెలిపింది. పీఎంఎల్ఏ చట్టం ప్రకారం మనీలాండరింగ్ కేసు కొనసాగడానికి షెడ్యూల్డ్ ఆఫెన్స్ (అంతర్లీన నేరం) ఆధారంగా ఎఫ్ఐఆర్ ఉండాలని కోర్టు స్పష్టం చేసింది. ఇది కాంగ్రెస్‌కు ఊరట కలిగించే అంశమైనప్పటికీ, కోర్టు నిర్ణయాన్ని ఈడీ సవాల్ చేసే అవకాశముంది. గత నవంబర్‌లో ఈడీ సమాచారం ఆధారంగా ఢిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. మరోవైపు రాహుల్‌పై కక్ష సాధింపు చర్యలను వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ శ్రేణులు దేశవ్యాప్త ఆందోళనలకు పిలుపునివ్వడం ప్రాముఖ్యతను సంతరించుకుంది.నేషనల్ హెరాల్డ్ కేసు నేపథ్యం ఒకసారి పరిశీలిద్దాం. 1938లో నేషనల్ హెరాల్డ్ వార్తా పత్రికను జవహర్‌లాల్ నెహ్రూ ప్రారంభించారు. అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఏజేఎల్) అనే సంస్థ ఈ పత్రికను ప్రచురించేది. 1942లో బ్రిటీష్ ప్రభుత్వం నేషనల్ హెరాల్డ్ పత్రికను నిషేధించింది. 1945లో తిరిగి ప్రారంభమైన నేషనల్ హెరాల్డ్ పత్రికను ఆర్థిక కారణాలతో 2008లో మూసేయాల్సి వచ్చింది. నేషనల్ హెరాల్డ్‌ను మూసే సమయానికి ఏజేఎల్ సంస్థకు కాంగ్రెస్ పార్టీ రూ. 90 కోట్ల మేర బకాయి పడినట్లు సమాచారం.

2012లో బీజేపీ నేత సుబ్రమణియన్ స్వామి ఢిల్లీలోని స్థానిక ట్రయల్ కోర్టులో గాంధీ కుటుంబం మీద కేసు వేశారు. ఏజేఎల్ సంస్థకు చెందిన 2 వేల కోట్ల రూపాయలకు పైగా ఆస్తులను హస్తగతం చేసుకోవడం కోసం, ఆ సంస్థను తమ యాజమాన్యంలోకి తెచ్చుకోవటానికి కాంగ్రెస్ పార్టీ నిధులను ఉపయోగించుకుందని ఆయన ఆరోపించారు. సుబ్రమణియన్ ఫిర్యాదు ఆధారంగా ఈడీ మనీలాండరింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది.నేషనల్ హెరాల్డ్ పత్రికను ప్రచురించే ఏజేఎల్‌కు కాంగ్రెస్ పార్టీ రూ.90 కోట్లకు పైగా వడ్డీలేని రుణం ఇచ్చిందని ఈడీ పేర్కొంది. ఆ రుణాన్ని రాహుల్ గాంధీ, సోనియా గాంధీలకు... మెజార్టీ వాటాలు ఉన్న యంగ్ ఇండియన్ లిమిటెడ్ (వైఐఎల్) సంస్థ ద్వారా రూ.50 లక్షలు మాత్రమే చెల్లించి.. ఏజేఎల్‌కు చెందిన సుమారు రూ. 2 వేల కోట్లు సొంతం చేసుకున్నారని ఈడీ ఆరోపించింది. ఇది మనీలాండరింగ్ చర్య కిందకు వస్తుందంటూ ఈడీ 2025 ఏప్రిల్‌లో చార్జ్‌షీట్ దాఖలు చేసింది. కాగా ఈ కేసు దశాబ్దకాలంగా రాజకీయ వివాదంగా మారింది.నేషనల్ హెరాల్డ్ పత్రిక స్వాతంత్ర్యోద్యమంతో ముడిపడి ఉండటం, దాని ఆస్తులు ఢిల్లీ, ముంబై, లక్నోల్లో ఉండటంతో వివాదం మరింత ముదిరింది. కాంగ్రెస్ నాయకులు ఇది పత్రికను పునరుజ్జీవింప జేయడానికి చేసిన ప్రయత్నమని వాదిస్తుంటే, ఇది ఆస్తుల దుర్వినియోగమని ఈడీ ఆరోపిస్తోంది.

తాజా కోర్టు నిర్ణయంతో సోనియా, రాహుల్‌లకు ఊరట లభించినప్పటికీ, కేసు పూర్తిగా ముగిసినట్టు కాదు. భవిష్యత్తులో మరిన్ని పరిణామాలు జరగవచ్చు.




బ్లాక్ మనీని (చట్ట వ్యతిరేకంగా, అక్రమ మార్గాల ద్వారా సంపాదించిన డబ్బు)ను వైట్ మనీగా (చట్టబద్ధంగా) మార్చే ప్రక్రియనే మనీ లాండరింగ్ అని అంటారు. అక్రమ మార్గాల ద్వారా సంపాదించిన లేదా ఆదాయానికి మించి సమకూరిన సంపాదనను బ్లాక్ మనీ అని అంటారు.మనీ లాండరింగ్‌లో వివిధ దశలను, చోటు చేసుకునే విధానాన్ని బెంగళూరుకు చెందిన ఒక కార్పొరేట్ సంస్థలో యాంటీ మనీ లాండరింగ్ విభాగానికి నేతృత్వం వహిస్తున్న బిపిన్ నాయిర్ బీబీసీకి వివరించారు.

మనీ లాండరింగ్ ప్లేస్‌మెంట్, లేయరింగ్, ఇంటెగ్రేషన్ అనే మూడు దశల్లో జరుగుతుంది.చట్ట వ్యతిరేకంగా సేకరించిన డబ్బును ఆర్థిక వ్యవస్థలోకి ప్రవేశపెట్టే దశను ప్లేస్‌మెంట్ అని అంటారు. మరొక రకంగా చెప్పాలంటే అక్రమంగా సంపాదించిన డబ్బును సక్రమ మార్గాల ద్వారా సంపాదించినట్లు చూపించే దశ.ఉదాహరణకు మీ చేతిలోకి అకస్మాత్తుగా పెద్ద మొత్తంలో ఆదాయానికి మించిన డబ్బు వచ్చింది. ఈ డబ్బు దొంగతనం, లంచాలు, దోపిడీలు, అవినీతి కార్యకలాపాల ద్వారా రావచ్చు. ఈ లావాదేవీలన్నీ సాధారణంగా నగదు రూపంలో జరుగుతాయి. ఉదాహరణకు ఒక వ్యక్తికి అక్రమ మార్గాల ద్వారా వారానికి రూ.3లక్షల రూపాయిలు సమకూరుతున్నాయి. ఈ డబ్బును బ్యాంకులో డిపాజిట్ చేయాలి. అలా చేయడం వల్ల మాత్రమే ఆయన ఆ డబ్బును చట్టబద్ధమైన సొమ్ముగా చూపించగలరు.ఈ డబ్బును చిన్న మొత్తాలుగా విడదీస్తారు.

3 లక్షలను ఆరు భాగాలుగా విభజించి ఆరు సార్లు లావాదేవీలు నిర్వహిస్తారు. ఇలాంటి వాటిని ఒకే బ్యాంకులో కాకుండా వేర్వేరు బ్యాంకుల్లో ఉన్న అకౌంట్లలో జమ చేస్తారు.ఇందుకోసం నిబంధనలను కఠినంగా పాటించని బ్యాంకులను ఎంపిక చేసుకుంటారు. చట్ట వ్యతిరేకంగా సంపాదించిన డబ్బును ఆర్థిక వ్యవస్థలోకి ప్రవేశపెడతారు.విదేశాల్లో ఉండే షెల్ సంస్థలు లేదా అకౌంట్లకు కొంత సొమ్మును పంపిస్తారు. పన్ను ఎగవేతదారులకు స్వర్గధామాలుగా ఉన్న దేశాల్లో షెల్ సంస్థలు, అకౌంట్లను తెరుస్తారు. ఈ అకౌంట్లలోకి డబ్బును చేరుస్తారు.కొన్ని వ్యాపారాల్లో జరిగే లావాదేవీల్లో ఈ నల్లధనాన్ని వైట్ మనీతో చిన్న మొత్తాల్లో కలిపేస్తారు. ఉదాహరణకు నగదు లావాదేవీలు ఎక్కువగా జరిగే రియల్ ఎస్టేట్, క్యాసినో, క్లబ్‌లు, బార్ల లాంటి వ్యాపారాల్లో చేరుస్తారు. నల్ల ధనాన్ని సక్రమంగా సంపాదించిన ధనంగా చూపించేందుకు రకరకాల మార్గాలు అవలంభిస్తారు. బ్లాక్ మనీని బదిలీ చేసేందుకు ఇన్‌వాయిస్ మోసాలు చాలా ఎక్కువగా చేస్తారు.

ఒక వస్తువు లేదా సేవల ఇన్‌వాయిస్ విలువను ఎక్కువ లేదా తక్కువ చేసి చూపిస్తారు. వస్తువులను మారు పేర్లతో రవాణా చేయడం (విలాసవంతమైన వస్తువులను తక్కువ విలువున్న వస్తువులుగా చూపించడం), ఉత్పత్తులను, సేవలను కొనకుండా కొన్నట్లు బిల్లులు చూపించడం ఇన్‌వాయిస్ మోసం కిందకే వస్తుంది. షెల్ కంపెనీలు, ఉనికిలోలేని సంస్థల నుంచి సామగ్రి కొనుగోలు చేసినట్లు రికార్డుల్లో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. కొన్నిసార్లు ధరలను కావాలనే ఎక్కువ చేసి చూపించినట్లు తేలింది. నగదు రూపంలో డబ్బులు చెల్లించి భూములు కూడా కొన్నట్లు వెలుగులోకి వచ్చింది.కంపెనీ ఖాతాలో వ్యక్తిగత ఖర్చులను కలిపి రాయడం, ప్రభుత్వ రిజిస్ట్రేషన్ విలువ కంటే చాలా తక్కువకే భూములు కొనుగోలు చేయడం లాంటి అవకతవకలను కూడా అధికారులు గుర్తించారు.

డబ్బును ఆర్థిక వ్యవస్థలోకి వివిధ మార్గాల్లో ప్రవేశపెట్టి, రకరకాల లావాదేవీలను నిర్వహిస్తారు. దీనిని న్యాయంగా సంపాదించిన డబ్బుగా చూపిస్తారు. డబ్బు పూర్తిగా ఆర్థిక వ్యవస్థలోకి ప్రవేశపెట్టగానే బ్యాంకు అకౌంట్లలోంచి నచ్చిన విలాసవంతమైన వస్తువులు కొనుక్కోవడం, విదేశీ పర్యటనలు చేయడం లాంటివి చేస్తారు.ఇందుకోసం నేరుగా బ్యాంకు నుంచి డబ్బులు విత్ డ్రా చేస్తారు. లేదా ఏటిఎం నుంచి డబ్బులు తీస్తారు.డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందని వివరించేందుకు ఇంటెగ్రేషన్‌ను చాలా జాగ్రత్తగా చేస్తారు. తిరిగి ఈ డబ్బంతా రకరకాల అకౌంట్లు, వ్యక్తుల చుట్టూ తిరిగి నేరస్థుడు లేదా అసలైన యజమానిని చేరుతుంది.

ఈ దశలో బ్లాక్ మనీకి, వైట్ మనీకి మధ్య తేడా కనిపెట్టడం చాలా కష్టంగా మారుతుంది.ఈ డబ్బును ఎలా కావాలంటే అలా ఉపయోగించుకోవచ్చు. ఇక ఎవరూ తమను పట్టుకోలేరనే ధీమాతో లాండరర్ అక్రమంగా సంపాదించిన డబ్బును విచ్చలవిడిగా ఖర్చు పెడతారు.చట్టవ్యతిరేకంగా సంపాదించిన నల్లధనం అంతా ఇప్పుడు వైట్ మనీగా మారిపోతుంది. ఈ దశను ఇంటెగ్రేషన్ అని అంటారు.ఈ డబ్బును ప్రాపర్టీ మార్కెట్, ఖరీదైన కార్లు, కళాఖండాలు, నగలు, లేదా ఖరీదైన వస్తువులను కొనుక్కునేందుకు వాడతారు.నిజానికి ఇవన్నీ ఒకదాని తర్వాత ఒకటి జరగాలనే నియమం లేదు. ఈ ప్రక్రియ అంతా ఏకకాలంలో కూడా జరిగే అవకాశముంది. ఈ మొత్తం వ్యవహారాన్ని నిర్వహించడంలో చాలా మంది వ్యక్తుల పాత్ర ఉంటుంది.విద్వేషాలను రెచ్చగొట్టే మతాధికారి అబూ హంజా కొడుకు టిటో ఇబన్ షేక్ నకిలీ బ్యాంకు అకౌంట్ల ద్వారా దొంగతనాలు, మోసాల ద్వారా సంపాదించిన సుమారు 350,000 పౌండ్లను లాండర్ చేసినట్లు కోర్టు విచారణలో తెలిసింది.ఈ కేసులో యూకే కోర్టు ఇబన్ షేక్‌కు 3 సంవత్సరాల 9 నెలల జైలు శిక్షను విధించింది.

# దేవుడి విషయంలోనూ మాట తప్పిన రేవంత్ రెడ్డి



- **అయోధ్య కన్నా కూడా భద్రాచల రాముల వారి చరిత్రే గొప్పది**
- **భద్రాచలం టెంపుల్ ను అభివృద్ధి చేసే మనసు బీజేపీకి రావటం లేదు**
- **తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత**

**జయభేరి, భద్రాచలం :**

జాగృతి జనం బాట జిల్లా పర్యటనలో భాగంగా తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత 5 గ్రామ పంచాయతీల ప్రజలతో సమావేశం అయ్యారు. కవిత మాట్లాడుతూ.. ఏపీలో కలిపిన ఐదు గ్రామాలను తిరిగి తెలంగాణలో విలీనం చేయాలి. అందుకోసం బీజేపీ నేతలు, చంద్రబాబు నాయుడు సహకరించాలి.

భద్రాద్రి రామాలయానికి రేవంత్ ఇస్తానన్న నిధులు వెంటనే విడుదల చేయాలి. జాగృతి సంస్థ 19 ఏళ్లుగా ప్రజల కోసం పనిచేస్తున్న విషయం తెలిసిందే. తెలంగాణ వ్యాప్తంగా ప్రజల సమస్యలు తెలుసుకోటానికి జనం బాట కార్యక్రమం పెట్టుకున్నాం. అన్ని జిల్లాలో రెండు రోజుల పాటు పర్యటన చేస్తూ ప్రజల సమస్యలు తెలుసుకుంటున్నామని అన్నారు. వచ్చిపోయామా అన్నట్లు కాకుండా ముందే మా టీమ్ సమస్యలను గుర్తిస్తోంది. దాని గురించి జనం బాట పర్యటనలో తెలుసుకొని సావధానంగా వాటి పరిష్కారానికి కూడా పోరాటం చేస్తున్నాం. ఇప్పటి వరకు 13 జిల్లాలు పర్యటించాం.

14వ జిల్లాగా కొత్తగూడెం వచ్చాం. ఈ ప్రాంతంలో ట్రైబల్స్ పాపులేషన్ చాలా ఎక్కువగా ఉంటుంది. గిరిజనులకే ఎంపీ, ఎమ్మెల్యే, మున్సిపల్, పంచాయితీ సీట్లు ఎక్కువగా ఉన్నాయి. మొన్నటి పంచాయితీ ఎన్నికల్లో బీసీలకు జీరో శాతం రిజర్వేషన్లు అంటే ఇక్కడ ఎంత ట్రైబల్ జనాభా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. కానీ గిరిజన కార్పొరేషన్ మాత్రం నిర్వీర్యం చేశారు. గత 30 ఏళ్లుగా ఒక్కరిని కూడా రిక్రూట్ చేసుకోలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏ విధంగా మోసం చేసిందో దాన్ని కాంగ్రెస్ కొనసాగిస్తోంది. గిరిజనుల అభివృద్ధి కోసం కార్పొరేషన్ కు కనీసం ఒక్క పైసా కూడా ఇవ్వలేదు. ఈ భూమి మూలవాసులకు ఒక్క మంచి అయిన చేశామా అన్నది ప్రభుత్వాలు ఆలోచించుకోవాలి. ఆదివాసీలు, గిరిజనుల కోసం ప్రత్యేకంగా బీఈడీ కాలేజ్ ఉంది. కానీ వాళ్ల కోసం ఒక్క ట్రైబల్ డీఎస్సీ కూడా వేయలేదు. గిరిజనులు, ఆదివాసీలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వానికి శ్రద్ధ లేదని అన్నారు.

జల్, జమీన్, జంగల్ అని పోరాడిన గిరిజన, ఆదివాసీలను పట్టించుకోకపోవటం దారుణం. వాళ్ల తరపున జాగృతి ముందుండి పోరాటం చేస్తుంది. గిరిజనులకు, ఆదివాసీలకు రిజర్వేషన్లు ఉన్నాయని చాలా మంది అంటుంటారు. భద్రాచలం చుట్టు ఉన్న ఐదు గ్రామాలను ఏపీ లో కలిపారు. సలు ముంపుతో సంబంధం లేని గ్రామాలను ఏపీ లో కలపటం అన్యాయం.

ఆ ఐదు గ్రామాల ప్రజలు ఏమీ కావాలన్న భద్రాచలం వచ్చే పరిస్థితి ఉంది. కానీ వారికి భద్రాచలంలో ఆరోగ్యశ్రీ వర్తించటం లేదు. కనీసం తక్షణ రిలీఫ్ గా ఆరోగ్యశ్రీ వర్తించేలా చేయాలి. రాముల వారి మాన్యాలు కాపాడుకోవాలంటే పురుషోత్తమం పట్నం లో రిటైన్ వాల్ కట్టాల్సిందే. దీని కోసం బీజేపీ ఎంపీలు, పెద్ద నేతలు ప్రయత్నం చేయాలని కోరుతున్నా. అయోధ్య కన్నా కూడా భద్రాచల రాముల వారి చరిత్రే గొప్పది. స్వయంగా రాముల వారే దర్శనం ఇచ్చిన భద్రాచలం టెంపుల్ ను అభివృద్ధి చేసే మనసు బీజేపీకి రావటం లేదు. ఐదు గ్రామాల సమస్య బీజేపీ నేతలతోనే పరిష్కారమవుతుంది. వాళ్లే వెంటపడి చేయించాలి. చంద్రబాబు నాయుడిని కూడా ఈ సమస్య పరిష్కరానికి కృషి చేయాలని రిక్వెస్ట్ చేస్తున్నా.

భద్రాచలం ముంపుతో సంబంధం లేకుండా ఉన్న ఐదు గ్రామాలను ఏపీలో కలిపారు. ఈ ఐదు గ్రామాలను తెలంగాణకు ఇచ్చేయాలని చంద్రబాబు నాయుడుని కోరుతున్నా. ప్రసాద్ స్కీం కింద రాముల వారి టెంపుల్ అభివృద్ధికి 3 వందల కోట్లు ఇవ్వాలి. భద్రాచలం టెంపుల్ కు రూ. 350 కోట్లు ఇస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. కానీ ఆరు గ్యారంటీలు, పెన్షన్లు ఇవ్వకుండా ఎలా మాట తప్పాడో... దేవుడి విషయంలోనూ అలాగే మాట తప్పారు. ప్రజలను మోసం చేసినట్లే రేవంత్ రెడ్డి ప్రెస్ వాళ్లను కూడా మోసం చేశారని ఆరోపించారు.

# పని హక్కులను హరించే బిల్లు ప్రతుల దగ్ధం

- వీబీ జీ రామ్ జీ బిల్లు ఆమోదం కోట్లాది శ్రమ జీవుల హక్కులను కాలరాయడమే!
- మూమ్మాటికి రాజ్యాంగం పై ఏకపక్ష దాడినే!
- డిబిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు రౌతు రమేష్,
- చుంచు రాజేందర్ డిబిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు!



జయభేరి, హసన్‌పర్తి :

దేశంలో కార్మికులు, కార్మిక సంఘాల నేతలు,ప్రజా ఉద్యమ కారులు దశాబ్దాల పోరాటాల త్యాగ ఫలితంగా సాధించుకున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం, 2005 (MGNREGA)ను రద్దు చేసి కొత్తగా ప్రతిపాదించిన వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్గార్ అండ్ ఆజీవిక మిషన్ (గ్రామీణ్) బిల్లు, 2025' (VBG RAM G) ను ఏకపక్షంగా తీసుకురావడం అనేది సరైంది కాదని బిల్లును వేంటనే రద్దు చేయాలని, ఇది కోట్లాది శ్రమ జీవుల హక్కులను హరించడమేనని, డిబిఎఫ్ ఆద్వర్యంలో హసన్‌పర్తి మండల కేంద్రములోని అంబేద్కర్ విగ్రహ సెంటర్ లో నిరసన వ్యక్తం చేసి, బిల్లు ప్రతులను దగ్ధం చేయడం జరిగిందని డిబిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు రౌతు రమేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు చుంచు రాజేందర్ అన్నారు.

ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ.. కూలీలైన హక్కుధారుల పని హక్కులను కాలరాసి, ఉపాధి హామీ చట్టాన్ని పూర్తిగా తీసివేసే విధంగా కేంద్రం ప్రయత్నం చేస్తుందని, ఇది మూమ్మాటికి భారత రాజ్యాంగంపై జరిగిన దాడిగా చూడాలని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో కూలీల హక్కుల కోరకు పనిచేస్తున్న కార్మికులతో గానీ, కార్మిక సంఘాలతో గానీ, ప్రజా సంఘాల నాయకులతో గాని ఎటువంటి సంప్రదింపులు జరపకుండా ప్రవేశపెట్టిన ఈ బిల్లు, చట్టబద్ధమైన హక్కుల ఆధారిత వ్యవస్థను, కేంద్ర ప్రభుత్వానికి ఎటువంటి జవాబుదారీతనం లేని బడ్జెట్ పరిమితులతో కూడిన ఒక సాధారణ పథకంగా మార్చేస్తుందని వాపోయారు.

### కేంద్రానికి మితిమీరిన విచక్షణాధికారం

MGNREGA అనేది డిమాండ్ ఆధారితమైనది, సార్వత్రికమైనది. అంటే, గ్రామీణ ప్రాంతాల్లో శారీరక శ్రమ చేయడానికి సిద్ధంగా ఉన్న ఎవరికైనా పని కల్పించాల్సిన బాధ్యత చట్టం కల్పిస్తుంది. కానీ, కొత్త VBG RAM G బిల్లులోని సెక్షన్ 5(1) ప్రకారం, "కేంద్ర ప్రభుత్వం నోటిఫై చేసిన గ్రామీణ ప్రాంతాల్లో మాత్రమే, నైపుణ్యం లేని పని చేయడానికి ముందుకొచ్చే కుటుంబాలకు 125 రోజులకు తగ్గకుండా గ్యారెంటీ పనిని రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తుంది." దీనర్థం, ఒకవేళ కేంద్రం ఏదైనా ప్రాంతాన్ని గ్రామీణ ప్రాంతంగా నోటిఫై చేయకపోతే, ఆ ప్రాంత ప్రజలకు పని హక్కు ఉండదు. ఇది సార్వత్రిక ఉపాధి హామీని, కేంద్ర ప్రభుత్వం దయాదాక్షిణ్యాలపై నడిచే ఒక సాధారణ పథకంగా దిగజార్చుతుందని అన్నారు.

### డిమాండ్ ఆధారితం నుండి సరఫరా ఆధారితానికి మార్పు

MGNREGA బలం దాని డిమాండ్ ఆధారిత స్వభావంలో ఉంది. అంటే ప్రజలు పని అడిగిన (డిమాండ్ చేసిన) 15 రోజుల్లోగా పని కల్పించాలి, లేకపోతే నిరుద్యోగ భృతి పొందే హక్కు ఉంటుందన్నారు. ఇందులో కూలీల వేతనాలు 100% కేంద్రమే భరిస్తుంది. అయితే, కొత్త బిల్లులోని సెక్షన్ 4(5) ప్రకారం, కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రామాణికాల ఆధారంగా, ప్రతి ఆర్థిక సంవత్సరానికి రాష్ట్రాల వారీగా నిధుల కేటాయింపును కేంద్రమే నిర్ణయిస్తుంది." అంతే కాకుండా, సెక్షన్ 4(6) ప్రకారం, "కేటాయించిన నిధుల కంటే ఎక్కువ ఖర్చు అయితే, దానిని రాష్ట్ర ప్రభుత్వమే భరించాలి." దీనివల్ల నిధుల కేటాయింపులో కేంద్రం ఏకపక్షంగా వ్యవహరించే అవకాశం ఉంది. ఇది MGNREGA యొక్క మూల సూత్రమైన "డిమాండ్‌ను బట్టి నిధులు" అనే విధానాన్ని తలక్రిందులు చేసి, బడ్జెట్‌ను బట్టి డిమాండ్ అనే స్థాయికి మారుస్తుందన్నారు.

### రాష్ట్రాలపై భారం

MGNREGA కింద, 100% కూలీల వేతనాలు, 75% మెటీరియల్ ఖర్చును కేంద్ర ప్రభుత్వం భరిస్తుంది. ఆచరణలో ఇది కేంద్రం, రాష్ట్రాల మధ్య 90:10 నిష్పత్తిలో ఉంటుంది. కానీ కొత్త బిల్లులోని సెక్షన్ 22(2) ప్రకారం, ఈ నిష్పత్తిని ఈశాన్య రాష్ట్రాలు, హిమాలయ రాష్ట్రాలకు 90:10గా, మిగిలిన ఇతర రాష్ట్రాలకు 60:40గా మార్చారు. ఈ నిబంధన రాష్ట్రాలపై భారీ ఆర్థిక భారాన్ని మోపడమే కాకుండా, పేద, వలస కార్మికులు ఎక్కువగా ఉన్న రాష్ట్రాలపై తీవ్ర ప్రభావం చూపుతుంది.

ఆర్థిక భారం పెరగడం వల్ల, రాష్ట్రాలు కార్మికుల పని డిమాండ్‌ను నమోదు చేయడానికి వెనుకడుగు వేసే ప్రమాదం ఉందని అన్నారు. ప్రణాళికా తయారీ క్రింది స్థాయి నుండి పై స్థాయికి పై 73వ రాజ్యాంగ సవరణకు అనుగుణంగా, MGNREGAలో పనుల ప్రణాళికను స్థానిక అవసరాల ఆధారంగా గ్రామ సభలు నిర్ణయిస్తాయి. కానీ కొత్త బిల్లులోని షెడ్యూల్ 1, క్లాజ్ 6(4) ప్రకారం, ' వికసిత్ భారత్ నేషనల్ రూరల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ స్టాక్' అనే వ్యవస్థ రాష్ట్రాలకు, పంచాయతీలకు మార్గనిర్దేశం చేస్తుంది. స్థానికంగా జరగాల్సిన ప్రణాళికా రచనను, కేంద్రం నిర్దేశించిన ప్రాధాన్యతలకు మార్చడం ద్వారా ఇది 73వ రాజ్యాంగ సవరణను ఉల్లంఘిస్తోంది.

### సాంకేతిక పర్యవేక్షణ, నిఘా

ఇప్పటికే డిజిటల్ హాజరు, ఆధార్ ఆధారిత చెల్లింపుల వంటి సాంకేతికతల వల్ల అనేక మంది కార్మికులు ఉపాధికి దూరమయ్యారని కార్మిక సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయన్నారు. అయినప్పటికీ, కొత్త బిల్లు బయోమెట్రిక్ ధృవీకరణను, జియోస్పేషియల్ టెక్నాలజీని తప్పనిసరి చేస్తూ, కార్మికులపై నిఘా పెంచేలా ఉంది. ముఖ్యంగా వ్యవసాయ కూలీలకు బయోమెట్రిక్ విధానం తీవ్ర ఇబ్బందులను కలిగిస్తుందని అనేక నివేదికలు స్పష్టం చేస్తున్నాయని, ఏడాది పొడవునా పని హక్కుపై 'బ్లాక్‌అవుట్' కాలాలు: MGNREGAలో ఎప్పుడైనా పని అడిగే హక్కు ఉంది. కానీ కొత్త బిల్లులోని సెక్షన్ 6(2) ప్రకారం, "వ్యవసాయ సీజన్లలో (విత్తనాలు వేసేటప్పుడు, కోతల సమయంలో) పనులు చేపట్టకుండా, ఆర్థిక సంవత్సరంలో మొత్తం 60 రోజులు రాష్ట్ర ప్రభుత్వాలు ముందుగానే నోటిఫై చేయాలి." దీనివల్ల పని అవసరం ఉన్న కార్మికులు, ముఖ్యంగా మహిళలు, కనీసం రెండు నెలల పాటు చట్టబద్ధంగా పనికి దూరమవుతారు. VBG RAM G బిల్లు అనేది సంస్కరణ కాదు, దశాబ్దాల పోరాటాల ద్వారా కార్మికులు సాధించుకున్న ప్రజాస్వామ్య, రాజ్యాంగ హక్కుల తిరోగమనం.

చట్టబద్ధమైన హక్కును తొలగించి, కేంద్రం నియంత్రణలో, బడ్జెట్ పరిమితులతో, నిఘా నీడలో నడిచే ఒక పథకంగా మార్చడం ద్వారా కేంద్ర ప్రభుత్వం సామాజిక న్యాయాన్ని దెబ్బతీస్తోంది. ఈ బిల్లు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం, 73వ రాజ్యాంగ సవరణను అవమానించడమే. ఇది అధికారాన్ని కార్మికులు, గ్రామ సభలు, రాష్ట్రాల చేతుల్లోంచి లాక్కుని కేంద్రం చేతుల్లో పెడుతుంది.

కనుక ఈ VBG RAM G బిల్లు, 2025ను ఏకగ్రీవంగా తిరస్కరించాలని, దీనిని తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేయాలన్నారు. కార్మికులు, వారి సంఘాల అనుమతి లేకుండా MGNREGAను రద్దు చేసే లేదా మార్చే ఏ ప్రయత్నమైనా ఆమోదయోగ్యం కాదన్నారు. గ్రామీణ కార్మికుల జీవనోపాధికి మూల స్తంభమైన ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకోవడానికి, ఈ ఏకపక్ష నిర్ణయాలను ప్రతిఘటించాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షులు రౌతు రమేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు చుంచు రాజేందర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిబిఎఫ్ రాష్ట్ర మహిళ నాయకురాలు బొర్ర సంపూర్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల అనిత, జిల్లా ఉపాధ్యక్షురాలు బౌతు రాధ, నాయకులు అడేపు రమాదేవి, దుర్గం పుష్పలత, వసంత, రాణి తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో క్రీడలకు పెద్దపీట..!

- ఒలింపిక్స్ పథకాలే లక్ష్యంగా సిఎం రేవంత్ రెడ్డి కృషి
- ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి




జయభేరి, ఉప్పల్ :

రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి సారధ్యంలో నడుస్తున్న ప్రజా పాలనలో క్రీడల అభివృద్ధితో పాటు క్రీడాకారులకు కావాల్సిన ప్రోత్సాహాన్ని కూడా అందిస్తుందన్నట్టుగా చెప్పారు. ఇండియన్ నేవీ డే సెలబ్రేషన్స్ లో భాగంగా ఎస్ ఎస్ ఎస్ యువసేన ఆధ్వర్యంలో నాచారం CDS బిల్డింగ్ లో 5వ కబడ్డీ పోటీలను పరమేశ్వర్ రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలోని యువ క్రీడాకారులకు సీఎం రేవంత్ రెడ్డి కావాల్సిన ప్రోత్సాహం అందిస్తూ కావాల్సిన విధంగా తీర్చిదిద్దుతున్నారన్నారు. కార్యక్రమంలో నాచారం డివిజన్ అధ్యక్షుడు బండారి శ్రీకాంత్ గౌడ్, కృష్ణారెడ్డి, ప్రకాష్ రెడ్డి, హెచ్ఆర్ మోహన్, రామ్ రెడ్డి, నందికొండ కొండ శ్రీనివాస్ రెడ్డి, సెంట్ జాన్స్ స్కూల్ ప్రిన్సిపాల్ రామ్ రెడ్డి, ఇందిర స్కూల్ ప్రిన్సిపాల్ అన్వర్, రమణ రెడ్డి, నర్సింగ్ రావు, స్వామి, రమేష్ గౌడ్, వీ రాజు, రాజు రెడ్డి, నూతల కంటి రాజు, మహేష్ యాదవ్, కృష్ణ యాదవ్, శ్రీనివాస్ రెడ్డి, నెమలి కొండ సునీల్ రెడ్డి, మహమ్మద్ అజీమ్, శ్రీమంత్ గౌడ్, గొల్లం నరేష్, జి రాకేష్, జి క్రాంతి కుమార్, సిహెచ్ నరేష్, రాజశేఖర్, సాహిద్, షరీఫుద్దిన్, ప్రవీణ్ గౌడ్, మధు గౌడ్, నర్సింగ్ రావు, టోనీ ఫ్రాన్సిస్, రేవంత్, ఉమా, చందు పాల్గొన్నారు.

# కేంద్రం ప్రభుత్వం నుండి ఉపాధి హామీ పథకాన్ని కాపాడండి




- సిఐటియు రాష్ట కార్యవర్గ సభ్యులు గని శెట్టి డిమాండ్

జయభేరి, పరవాడ:

పరవాడ. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న సవరణలకు నిరసనగా శుక్రవారం పరవాడ మండలం గౌతు లక్షన్న నగర్ పని ప్రదేశంలో కూలీలతో సిఐటియు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేయడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గని శెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ చట్టబద్ధ హక్కుగా ఉన్న ఈ పథకాన్ని రద్దు చేసేందుకు కేంద్రం చేస్తున్న కుట్రలను తీవ్రంగా వ్యతిరేకించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకురానున్న వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజుగా అండ్ అజివిక్ మిషన్ పేరుతో ఉపాధి హామీ పథకానికి నిర్వీర్యానికి పూనుకున్నారన్నారు. పని హక్కుగా ఉన్న పాత చట్టాన్ని మార్చి ఇదొక సాధారణ పథకంగా అమల చేయనున్నారని ఇప్పటివరకు వ్యవసాయ కార్మికులకు డిమాండ్ను బట్టి ఉపాధి కల్పించే విధానాన్ని మార్చేసి అవసరాన్ని బట్టి పనులు పెట్టడం అంటే ఈ పథకం మౌలిక స్వభావాన్ని నిర్వీర్యం చేయడమేనని గని శెట్టి విమర్శించారు. గ్రామీణ కూలీలకు మోడీ ప్రభుత్వం చేస్తున్న ద్రోహాన్ని పక్కదారి పట్టించడానికి ఈ పథకంలో మహాత్మా గాంధీ పేరు తొలగించారని తెలిపారు. పని దినాలు 100 నుండి 125 రోజులకు పెంచినట్లు చెప్పడం ప్రజలను మోసగించడమే అన్నారు ఉపాధి హామీ పథకం అమలులో 60 రోజులు పాటు సెలవులు ప్రకటించడం అంటే కార్మికులకు పెరిగిన దినాలు ఎక్కడ అమలు అవుతాయని ఆయన ప్రశ్నించారు. ఈ నిరసన కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎస్. రాజారావు, కే మంగ, బి వరలక్ష్మి, వి తేజస్వి, బి సూర్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# కొల్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలో కేసీఆర్ నగర్లో విషాదం

- ఎనిమిదో అంతస్తు నుండి జారిపడి యువతి మృతి

జయభేరి, హైదరాబాద్:

ఒకే ప్రైవేట్ కంపెనీలో పనిచేసే సహోద్యోగుల మధ్య పరిచయం ఒక యువతి ప్రాణాలను బలితీసుకున్న విషాద సంఘటన కేసీఆర్ నగర్లో చోటుచేసుకుంది. మృతురాలు సకిన ఫాతిమా, నిందితుడు హుస్సేనాలి ఇద్దరూ ఒక ప్రైవేట్ కంపెనీలో పని చేస్తూ ఒకరికొకరు పరిచయస్తులు. ఫాతిమా కుటుంబానికి కొల్లూరు కేసీఆర్ నగర్లోని బ్లాక్ నంబర్ 40లో డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కేటాయించారు. గురువారం రాత్రి ఫాతిమా, హుస్సేనాలి కలిసి డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కి వచ్చారు. అక్కడికి ఫాతిమా తండ్రి రాగా, తండ్రి గొంతు విన్న ఫాతిమా భయం తో వణికిపోయింది. తండ్రికి దొరికిపోతామనే ఆందోళనతో ఆమె బాల్కనీ గుండా పక్క ఫ్లాట్లోకి వెళ్లడానికి హుస్సేనాలి సహకారం తో వెల్ల డనికి ప్రయత్నించింది. ఈ క్రమంలో పట్టుతప్పి ఎనిమిదో అంతస్తు నుండి కింద పడిపోయింది. తీవ్ర గాయాలవ్వడంతో ఫాతిమా అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది.

# కోట్‌పల్లి లో ఉద్రిక్తత – నూతన సర్పంచ్ భర్తపై అర్ధరాత్రి దాడి

జయభేరి, వికారాబాద్ :

కోట్‌పల్లి గ్రామంలో అర్ధరాత్రి సమయంలో నూతన సర్పంచ్ భర్త సంగయ్య స్వామిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో సంగయ్య స్వామికి తీవ్ర గాయాలు కాగా, ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని యశోద హాస్పిటల్‌కు తరలించారు. ఈ ఘటనకు నిరసనగా కోట్‌పల్లి గ్రామంలో నాయకులు, ప్రజాప్రతినిధులు రోడ్డుపైకి వచ్చి ఆందోళన చేపట్టారు. దాడికి పాల్పడ్డ నిందితులను వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొనడంతో పోలీసులు భారీగా మోహరించి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. రాత్రి దుండగుల దాడిలో తీవ్ర గాయాలపాలైన సర్పంచ్ బస్సమ్మ భర్త సంగయ్య స్వామిని అపోలో ఆస్పత్రిలో పరామర్శించిన తెలంగాణ శాసన మండలి ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి వైద్యులు, కుటుంబ సభ్యుల తో సంగయ్య స్వామి ఆరోగ్య పరిస్థితి పై ఆరా. మెరుగైన వైద్యం అందించాలని ఆస్పత్రి వైద్యులకు సూచించారు.వికారాబాద్ డీసీసీ అధ్యక్షుడు ధారాసింగ్, సంగయ్య కుమారుడు శేఖర్, కుటుంబ సభ్యులు ఆయనతో ఉన్నారు. ఈ దాడి వెనుక కారణాలపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించగా, నిందితులను త్వరలోనే పట్టుకుని న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఘటనపై పూర్తి వివరాలు ఇంకా వెలుగులోకి రావాల్సి ఉంది.

# రామ్మోహన్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన సీఎం

జయభేరి, న్యూఢిల్లీ :

ఢిల్లీలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి కూటమి ఎంపీలు స్వాగతం పలికారతదుద. . కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు జన్మదినం కావడంతో సీఎం చంద్రబాబు నాయుడు ఆయనకు శుభాకాంక్షలు తెలిపి, కేక్ తినిపించారు.



# గ్రామాలు అభివృద్దె ధ్యేయంగా సర్పంచ్ పని చేయాలి

- ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డిని కలిసిన నూతన సర్పంచ్ లు

జయభేరి, ఇబ్రహీంపట్నం :

నూతనంగా విజయం సాధించిన వివిధ గ్రామాల కాంగ్రెస్ సర్పంచ్ లు ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డిని తొర్రర్ క్యాంపు కార్యాలయంలో మర్యాదకపూర్వకంగా కలిశారు. ఈ మేరకు ఎమ్మెల్యే రంగారెడ్డి నూతన సర్పంచ్ లు, వార్డు మెంబర్ లకు శాలువలతో సన్మానిచ్చారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ లు గ్రామాల అభివృద్దె ధ్యేయంగా పని చేయాలనీ సూచించారు. గ్రామాలకు కావాల్సిన నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చారు.

# హెవీ డ్రైవింగ్ శిక్షణకు అన్ని సదుపాయాలతో అనకాపల్లి ఆర్టీసీ



జయభేరి, అనకాపల్లి :

ఏపీఎస్ ఆర్టీసీ లో పూర్తిస్థాయిలో హెవీ డ్రైవింగ్లో శిక్షణకు అవసరమైన అన్ని సదుపాయాలు ఉన్నాయని ఎస్సీ కార్పొరేషన్ జిల్లా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సత్య పద్మ తెలిపారు. అనకాపల్లి డిపో ఆవరణలో హెవీ డ్రైవింగ్ శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు గురువారం ఆమె ధ్రువపత్రాల పంపిణీ చేశారు. జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి ప్రవీణ మాట్లాడుతూ ఇప్పటివరకు 173 మంది అనకాపల్లిలో శిక్షణ అందజేశామన్నారు.డిపో మేనేజర్ హనుమశ్రీ ఆధ్వర్యంలో జరిగిన శిక్షణ కార్యమంలో కార్పొరేషన్ ప్రతినిధి భాస్కరరావు,శిక్షణ కేంద్రం బాధ్యులు బాపు నాయుడు, రమణ తదితరులు పాల్గొన్నారు.

# ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తో సమావేశమైన ఎమ్మెల్యే పంచకర్ల




జయభేరి, పరవాడ:

విజయవాడ మంగళగిరి జనసేన పార్టీ ప్రధాన కార్యాలయంలో జనసేన పార్టీ ఎమ్మెల్యేలతో ప్రత్యేకంగా నిర్వహించిన వన్ టూ వన్ సమీక్ష సమావేశంలో పాల్గొని శుక్రవారం 19.12.2025 తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షుడు కొణిదల పవన్ కళ్యాణ్ తో పెందుర్తి నియోజకవర్గం అభివృద్ధి మరియు సంక్షేమం పై జనసేన పార్టీ ఉమ్మడి విశాఖపట్నం రూరల్ జిల్లా అధ్యక్షుడు పెందుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు చర్చించారు. పెందుర్తి నియోజవర్గంలో ఇప్పటివరకు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలు తీరును ఎమ్మెల్యే డిప్యూటీ సీఎంకు వివరించారు. నియోజకవర్గంలో కొనసాగుతున్న పలు మేజర్ పనుల ప్రస్తుత స్థితిగతులు, వాటిని సత్వరమే పూర్తి చేయడానికి కావాల్సిన నిధులు మరియు సహాయ సహకారాలపై చర్చించారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజా సమస్యల పరిష్కారంలో ఎమ్మెల్యేలు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ సూచించారు అని తెలియజేసారు.

# వైద్యం కోసం ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి ఆర్థిక సహాయం

- రెండు లక్షల రూపాయల ఎల్ఓసి అందజేసిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి



జయభేరి, షాద్ నగర్, డిసెంబర్ 19 :

రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం ఇన్ముల్ నార్వ గ్రామానికి చెందిన కేతావత్ విష్ణు అనారోగ్య సమస్యతో బాధపడుతూ ఎమ్మెల్సీ నవీన్ రెడ్డిని ఆర్థిక సాయం కోరగా మెరుగైన వైద్యం కొరకు తన సిపారసు ద్వారా మంజూరైన 2 లక్షల ఎల్ఓసిని స్థానిక మాజీ సర్పంచ్ అజయ్ నాయక్ సమక్షంలో లబ్ధిదారునికి ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి తన కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా నవీన్ రెడ్డి మాట్లాడుతూ; ఆర్థిక సహాయంలో ఎల్లప్పుడూ ముందుంటా అని అన్నారు. విష్ణు త్వరగా కోలుకొని ఆరోగ్యంగా ఉండాలని,ఏ సహాయ సహకారాలు కావాలన్నా తన వంతు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ రహిత సమాజం కోసం రాజీ లేని కృషి చేస్తా..

- విద్యుత్ స్తంభాల స్థాన భ్రంశం పనులలో వేగం పెంచాలని విద్యుత్ అధికారులకు ఆదేశం
- ఉషముళ్ళపూడి కమాన్ నుండి గాజులరామారం వరకు వయా ఎల్లమ్మబండ ప్రధాన రహదారి 100 ఫీట్ రోడ్డు విస్తరణ పనులలో వేగం పెంచాలి PAC చైర్మన్ ఆరెకపూడి గాంధీ

**జయభేరి, శేరిలింగంపల్లి :**

ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఉషముళ్ళపూడి కమాన్ నుండి గాజులరామారం వరకు చేపడుతున్న వయా ఎల్లమ్మబండ ప్రధాన రహదారి 100 ఫీట్ రోడ్డు విస్తరణ పనులను కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, GHMC ఇంజనీరింగ్ విభాగం, విద్యుత్ విభాగం అధికారులతో కలిసి పరిశీలించిన PAC చైర్మన్ ఆరెకపూడి గాంధీ. ఈ సందర్భంగా PAC చైర్మన్ గాంధీ మాట్లాడుతూ.. ఉషముళ్ళపూడి కమాన్ నుండి గాజుల రామరం వెళ్లే రోడ్డు వయా ఎల్లమ్మబండ రోడ్డు నిత్యం ట్రాఫిక్ సమస్యతో ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు అని, ట్రాఫిక్ సమస్య పరిష్కారానికై 100 ఫీట్ రోడ్డు విస్తరణ చేపట్టడం జరిగినది అని, దానిలో భాగంగా తీసుకోవాల్సిన చర్యల పై అధికారులు, కార్పొరేటర్ తో కలిసి ఉష ముళ్ళపూడి కమాన్ నుండి సిక్కుల బస్తీ వరకు పాదయాత్రగా స్వయంగా నడుచుకుంటూ వెళ్లడం జరిగినది అని PAC చైర్మన్ గాంధీ తెలియచేసారు. 100 ఫీట్ రోడ్డు విస్తరణలో ఉన్న అడ్డంకులను తొల గిస్తూ తీసుకోవాల్సిన చర్యల పై చర్చించి, ప్రణాళిక ను రూపొందించి రోడ్డు విస్తరణ పనులు వెంటనే చేపట్టి త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలని, యుద్ధప్రాతిపదికన రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని, రోడ్డు విభాగిని పనులు నాణ్యత ప్రమాణాలు తో చేపట్టాలని, నాణ్యత విషయంలో ఎక్కడ రాజీ పడకూడదని, నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని, అధికారులను PAC చైర్మన్ గాంధీ అదేశించడం జరిగినది. ఉషముళ్ళపూడి కమాన్ నుండి సిక్కుల బస్తి వరకు ఎల్లమ్మ బండ రోడ్డు విస్తరణలో భాగంగా రోడ్డు పక్కన గల విద్యుత్ స్థంబాలను స్థాన భ్రంశం చర్యలను వెంటనే చేపట్టాలని, అదేవిధంగా రోడ్డు డివైడర్ మధ్యలో సుందరికరణ పనులు చేపట్టాలని. ఎల్లమ్మబండ రోడ్డు లో తీవ్ర ట్రాఫిక్ సమస్య నెలకొంది కావున విస్తరణ పనులు త్వరితగతిన చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, రోడ్డుల విస్తరణ పనులు పై అధికారులకు పలు సూచనలు, సలహాలు తెలియచేయడం జరిగినది. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, రోడ్డు మధ్యలో అడ్డంకిగా ఉన్న ఎలక్ట్రికల్ స్థంబాలను త్వరితగతిన స్థాన భ్రంశం చేయాలని, 100 ఫీట్ రోడ్డు విస్తరణ త్వరిత గతిన పూర్తి చేసి ప్రజలకు త్వరలోనే అందుబాటులోకి తీసుకువస్తామని, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కల్గ కుండా చూడాలని, ఈ 100 ఫీట్ రోడ్డు విస్తరణ వలన ప్రజలకు సమయం, ఇంధనం ఆదా అవుతుంది అని, మౌలిక వసతుల కల్పనలో అలసత్వం ప్రదర్శించకుం డా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని PAC చైర్మన్ గాంధీ అధికారులను ఆదేశించడం జరిగినది. ట్రాఫిక్ సమస్య నివారణకై, నాణ్యమైన, మన్నిక గల రోడ్లను నిర్మిస్తామని, ప్రజలకు అందుబాటులోకి తీసు కువస్తామని PAC చైర్మన్ గాంధీ చెప్పడం జరిగినది. ప్రజలకు ట్రాఫిక్ రహిత, సుఖవంతమైన, మెరుగైన రవాణా సౌకర్యం కొరకు శాయ శక్తుల కృషి చేస్తానని, ప్రజలకు రోడ్డు ఎంతగానో ఉపయోగపడుతుంది అని PAC చైర్మన్ గాంధీ గారు చెప్పడం జరిగినది. 100 ఫీట్ రోడ్డు విస్తరణ పై అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇవ్వడం జరిగినది అని, ఏ చిన్న సమస్య అయిన తన దృష్టికి తీసుకువస్తే తప్పకుండా పరిష్కరి స్తానని PAC చైర్మన్ గాంధీ తెలియచేశారు. అదేవిధంగా శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని, అన్నివేళలో ప్రజలకు అందుబాటులోకి ఉంటానని, మెరుగైన ప్రజా జీవనా నికి అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు తనవంతు కృషి చేస్తానని ,నియోజకవర్గాన్ని ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని PAC చైర్మన్ గాంధీ గారు. పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో GHMC అధికారులు EE గోవర్ధన్, DE రమేష్, వర్క్ ఇన్స్పెక్టర్ రవి, విద్యుత్ విభాగం అధికారులు ADE శ్యామ్, నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.





## గ్రామాల అభివృద్ధికి అండగా ఉంటా..

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- ఎమ్మెల్యేను కలుసుకున్న కేశం పేట సర్పంచ్ బోజ్జం శ్రీశైలం

**జయభేరి, షాద్ నగర్, డిసెంబర్ 19 :**

గ్రామాల అభివృద్ధికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించి అండగా ఉంటానన్న షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో నూతనంగా ఎన్నుకోబడిన సర్పంచ్ బొజ్జం శ్రీశైలం, వార్డు సభ్యులు శుక్రవారం షాద్ నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే శంకర్ ను మర్యాదపూర్వ కంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ సర్పంచ్ శ్రీశైలం తదితర వార్డు సభ్యులను అభినందించి వారిని శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భం గా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ; గ్రామాలలో మౌలిక సదుపాయాలు కల్పించ డంతోపాటు ప్రభుత్వ సహకారంతో అనేక అభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించి అభివృద్ధికి అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు తదితర నాయకులు పాల్గొన్నారు.

## విజయం సాధించిన సర్పంచ్ ని సత్కరించిన మాజీ ఎమ్మెల్యే



**జయభేరి, చింతపల్లి :**

చింతపల్లి మండలం కుర్మేడ్ గ్రామ సర్పంచ్ గా విజయం సాధించిన కంబాలప ల్లి చెన్నమ్మ లాలయ్య ని అభినందించి, శాలువాలతో సత్కరించిన బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి కుంభం శ్వేత శ్రీశైలం గౌడ్ వార్డు సభ్యులు బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి గుర్తింపు లభించిన వీరారెడ్డిపల్లి పాఠశాల



**జయభేరి, తుర్కపల్లి, డిసెంబర్ 19:**

స్వచ్ఛ విద్యాలయ స్టార్ రేటింగ్ లో తుర్కపల్లి మండలం వీరారెడ్డిపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాష్ట్రస్థాయికి ఎంపిక అయిందని ప్రధానోపాధ్యాయులు బండారి సత్యం తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలల్లో పచ్చదనం పరిశుభ్రత పెంపొందించేందుకు కేంద్ర విద్యాశాఖ కొత్త స్టార్ రేటింగ్ విధానాన్ని అమలు చేస్తుంది. హరిత విద్యాలయాల రేటింగ్ ప్రారంభించారు. యాదాద్రి భువనగిరి జిల్లా నుండి ఎనిమిది పాఠశాల రాష్ట్రస్థాయికి ఎంపిక కాగా అందులో వీరారెడ్డిపల్లి పాఠశాల ఉండడం అభినందనీయమని అన్నారు. పాఠ శాలలో త్రాగునీటి వసతి, బారుర, బాలికల లకు వేరువేరు మరుగుదొడ్లు నిర్వహణ, వ్యర్థాల నిర్వహణ, పరిశుభ్రతపై విద్యార్థులకు కల్పిస్తున్న అవగాహన, పాఠశాల పరిసరాల శుభ్రత వంటి 60 అంశాలపై ప్రత్యేక ఉపాధ్యాయ బృందం అధ్యయనం చేసి వీరారెడ్డిపల్లి జెడ్పి హెచ్ఎస్ పాఠశాలను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమంగా నిలిచిన పాఠశాలలను జాతీయస్థాయికి పంపుతారు. జాతీయ స్థాయికి ఎంపిక అయితే ప్రధాని నరేంద్ర మోడీ చేతుల మీదుగా లక్ష నజరానా, అవార్డు అందజేస్తారని ప్రధానోపాధ్యాయులు బండారు సత్యం తెలిపారు. ఈ ఘనతపై గ్రామస్తులు, ఉపాధ్యాయులు వర్షాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గీత, శ్రీనివాస్, జరీనా బేగం, బెక్కం సాహెబ్, కచ్చిగళ్ళ మల్లయ్య, వసంత, వినయ్ కుమార్ పాల్గొన్నారు.

## వన్ టూ వన్ ఎమ్మెల్యేలతో పవన్



**జయభేరి, విజయవాడ, డిసెంబర్ 19:**

డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ తమ పార్టీ ఎమ్మెల్యేలతో సమావేశమవుతున్నారు. శుక్రవారం నుంచి ఆయన పార్టీ శాసనసభ్యులతో వన్ టూ వన్ (ముఖాముఖి) భేటీలు నిర్వహిస్తున్నారు. నియోజకవర్గాల్లో క్షేత్రస్థాయి పరిస్థితులు, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై ఆయన ప్రధానంగా దృష్టి సారించారు. ఈ సమావేశాల పరంపర మండలి బుద్ధప్రసాద్‌తో మొదలైంది.ఈ సమీక్షల్లో భాగంగా, ప్రతి నియోజకవర్గంలో ఇప్పటివరకు చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు తీరు, కొనసాగుతున్న ప్రాజెక్టుల వివరాలను పవన్ కల్యాణ్ అడిగి తెలుసుకోనున్నారు. అదేవిధంగా, నియోజకవర్గాల్లో ఇంకా పరిష్కారం కాని సమస్యలు, పార్టీ కార్యక్రమాల నిర్వహణ వంటి అంశాలపై ఎమ్మెల్యేలతో చర్చిస్తారు.ఈ రోజు మొత్తం తొమ్మిది మంది ఎమ్మెల్యేలతో పవన్ కల్యాణ్ సమావేశం కానున్నారు. మండలి బుద్ధ ప్రసాద్ అనంతరం దేవ వరప్రసాద్, లోకం నాగ మాధవి, గిడ్డి సత్యనారాయణ, పంతం నానాజీ, సీహెచ్ వంశీకృష్ణ, నిమ్మక జయకృష్ణ, పంచకర్ల రమేశ్ బాబు, సుందరపు విజయ్ కుమార్ లతో ఆయన ముఖాముఖి భేటీ అవుతారు.

## మంచి కథ కోసం ఎదురు చూపులు

- రకుల్ ప్రీత్ సింగ్

**జయభేరి, హైదరాబాద్:**

టాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా వెలిగిన రకుల్ ప్రీత్ సింగ్, తాను మళ్లీ తెలుగు సినిమాల్లో నటించేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. మంచి కథ కోసం ఎదురుచూస్తున్నానని, బాహుబలి వంటి గొప్ప చిత్రంలో నటించడం తన కల అని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.హైదరాబాద్‌లోని పంజాగుట్టలో ప్రముఖ మేకప్ ఆర్టిస్ట్ కొత్తగా ఏర్పాటు చేసిన మేకప్ స్టూడియోను రకుల్ ప్రీత్ సింగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ, తెలుగు చిత్ర పరిశ్రమతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు.ప్రేక్షకులు నన్ను ఎంతో ఆదరించారని,ఈ మధ్య కాలంలో తెలుగు సినిమాలు చేయకపోవడంతో అందరినీ చాలా మిస్ అవుతున్నానని అన్నారు.మంచి కథ దొరికితే తప్పకుండా నటిస్తానని అన్నారు.

## త్వరలోనే నాకు మంత్రి పదవి: కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

**జయభేరి, హైదరాబాద్:**

త్వరలోనే తనకు మంత్రి పదవి వస్తుందని కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మంత్రివర్గ విస్తరణలో తనకు చోటు లభిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజాసేవలో ఎప్పుడూ ముందుంటానని, అధిష్టానం నిర్ణయం మేరకు త్వరలోనే శుభవార్త వింటారని పేర్కొన్నారు. రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలు ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.

## కర్ణాటక లో సీఎం మార్పుపై ఇంకా కొనసాగుతూనే ఉన్న సందిగ్ధత

**జయభేరి, బెంగళూర్ డిసెంబర్ 19:**

కర్ణాటక లో సీఎం మార్పుపై సందిగ్ధత ఇంకా కొనసాగుతూనే ఉంది. త్వరలో కర్ణాటకలో సీఎం మార్పు ఉంటుందని, డీకే శివకుమార్ సీఎం అవుతారని డీకే వర్గం ప్రచారం చేస్తుండగా.. సీఎం మార్పు జరిగే అవకాశం లేదని, పూర్తిగా ఐదేళ్లు తానే సీఎంగా కొనసాగుతానని సిద్ధరామయ్య సంకేతాలు ఇస్తున్నారు. ఈ విషయంపై ఆయన తాజాగా మరోసారి స్పందించారు. అసెంబ్లీలో మాట్లాడుతూ.. సీఎం పదవి షేరింగ్‌కు సంబంధించి నాడు (అసెంబ్లీ ఎన్నికల్లో విజయం తర్వాత) ఎలాంటి ఒప్పందం జరగలేదని చెప్పారు. 'నేను ఇప్పటికే ఒకసారి ఐదేళ్లు సీఎం పనిచేశాను. ఆ తర్వాత మళ్లీ ముఖ్యమంత్రిని అయ్యాను. నాకు తెలిసినంతవరకు పార్టీ అధిష్ఠానం నాకే అనుకూలంగా ఉంది. సీఎం పదవిని ఇద్దరు వ్యక్తులు 2.5 ఏళ్ల చొప్పున పంచుకోవాలనే ఒప్పందమేదీ జరగలేదు' అని సిద్ధరామయ్య వ్యాఖ్యానించారు. అసెంబ్లీలో ప్రతిపక్షాల కామెంట్స్‌కు స్పందనగా.. ఐదేళ్లు తానే సీఎంగా కొనసాగుతానని సిద్ధరామయ్య చెప్పడం గత నాలుగు రోజుల్లో ఇది రెండోసారి. గత మంగళవారం కూడా ఆయన అసెంబ్లీలో ప్రతిపక్ష ఎమ్మెల్యేల కామెంట్స్‌కు స్పందిస్తూ.. 'ఇప్పుడు మళ్లీ చెబుతున్నా. ప్రస్తుతం నేను రాష్ట్ర ముఖ్యమంత్రిని, ఇక ముందు కూడా నేను ముఖ్యమంత్రిగా ఉంటా' అని వ్యాఖ్యానించారు. కాగా సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం శివకుమార్ మధ్య వివాదం చాలారోజులుగా కొనసాగుతోంది. ఈ విషయం హైకమాండ్ సైతం జోక్యం చేసుకుని సయోధ్య కుదిర్చింది. అయినా ప్రయోజనం లేదు. సీఎం మార్పు ఉంటుందని ప్రచారం జరుగుతూనే ఉంది.

## 'కిడ్జీ & మౌంట్ లిటెరా జీ' విద్యార్థుల ప్రభంజనం

**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ లక్ష్యం పట్ల పట్టుదల, నిరంతర సాధన ఉంటే ఆకాశమే హద్దు అని దేవరకొండకు చెందిన విద్యార్థులు మరోసారి నిరూపించారు. ఈ నెల డిసెంబర్ 14న హైదరాబాద్‌లోని కోట్ల విజయ్ భాస్కర్ రెడ్డి స్టేడియంలో అత్యంత ఉత్కంఠభరితంగా జరిగిన నేషనల్ కరాటే ఛాంపియన్‌షిప్‌లో దేవరకొండ కిడ్జీ, మౌంట్ లిటెరా జీ స్కూల్ (KIDZEE & MOUNT LITERA ZEE SCHOOL) విద్యార్థులు అఖండ విజయాన్ని సాధించి, పాఠశాల కీర్తిని జాతీయ స్థాయిలో చాటిచెప్పారు.

**పతకాల పంట పండించిన విద్యార్థులు**

దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుండి వందలాది మంది పోటీపడిన ఈ ఛాంపియన్‌షిప్‌లో, దేవరకొండ విద్యార్థులు అసాధారణ ప్రతిభను కనబరిచారు. ప్రత్యర్థులకు గట్టి పోటీనిస్తూ ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోవడమే కాకుండా, స్వర్ణ , రజత పతకాలతో మెరిశారు. విజేతలను పాఠశాల ప్రిన్సిపాల్ అష్రఫ్ అచారత్ (Ashraf Acharath) ప్రత్యేకంగా అభినందించి, వారికి మెడల్స్, ప్రశంసా పత్రాలను అందజేశారు.

**క్రమశిక్షణే విజయానికి మార్గం ప్రిన్సిపాల్ అష్రఫ్ అచారత్**

ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ఓటమిని ఎదుర్కొనే ధైర్యం, గెలుపుపై ఉన్న ఆశయం మనిషిని ఉన్నత శిఖరాలకు చేరుస్తాయి. ఈ మెడల్స్ కేవలం విద్యార్థుల ప్రతిభకు గుర్తింపు మాత్రమే కాదు, వారి క్రమశిక్షణకు మరియు నిరంతర కృషికి నిదర్శనం. కరాటే వంటి విద్యలు కేవలం ఆత్మరక్షణకే కాకుండా, జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొనే మానసిక స్థైర్యాన్ని, శారీరక దృఢత్వాన్ని ప్రసాదిస్తాయి, అని విద్యార్థులను ఉత్సాహపరిచారు.




**మాస్టర్ గోపి నాయక్ కృషి అమోఘం**

విద్యార్థులను ఛాంపియన్లుగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించిన కరాటే మాస్టర్ గోపి నాయక్ అంకితభావాన్ని ప్రిన్సిపాల్, యాజమాన్యం కొనియాడారు. ఈ విజయం భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ విజయాలకు నాంది కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయ బృందం, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## రెండేళ్లలోనే తెలంగాణ రాష్ట్రానికి కొత్త దిశ

- మారుతున్న కాలానికి అనుగుణంగా పనితీరు మారాలి
- డీపీఆర్వోల వర్క్‌షాపులో
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**జయభేరి, హైదరాబాద్, డిసెంబర్19 :**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం, రెండేళ్ల పాలనలోనే తెలంగాణకు స్పష్టమైన కొత్త దిశను చూపించిందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రజలు ఏ మార్పు కోరుకొని కాంగ్రెస్ పార్టీపై విశ్వాసం ఉంచారో, ఆ మార్పును కేవలం రెండేళ్లలోనే ప్రజల కళ్ల ముందే నిలబెట్టామని తెలిపారు. ప్రజల నమ్మకాన్ని, విశ్వాసాన్ని ప్రజా ప్రభుత్వం నిలబెట్టుకుందని స్పష్టం చేశారు. తెలంగాణ సమాచార పౌర సంబంధాల శాఖ, మీడియా అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో నాంపల్లిలోని మీడియా అకాడమీలో జిల్లా ప్రజా సంబంధాల అధికారులతో శుక్రవారం నిర్వహించిన పునశ్చరణ తరగతులకు మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "మేం అధికారం చేపట్టినప్పుడు తెలంగాణ అన్ని రంగాల్లో తీవ్రమైన సంక్షోభంలో ఉంది. ఒక్కో మెట్టు ఎక్కుతూ ఆ సంక్షోభం నుంచి బయటపడి, అభివృద్ధి-సంక్షేమాలను పరుగులు పెట్టిస్తున్నాం" అని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ పేదవాడికి అండగా నిలిచామని తెలిపారు. వ్యవసాయం, విద్య, వైద్యం, గృహ నిర్మాణం, సన్నబియ్యం పంపిణీ, రేషన్ కార్డులు, ఉపాధి కల్పన వంటి ప్రతి రంగంలో ప్రజా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలబెడుతున్నాయని అన్నారు. అయితే, ప్రభుత్వం చేస్తున్న మంచి కార్యక్రమాలు ఆశించిన స్థాయిలో ప్రజల్లోకి చేరడం లేదని అన్నారు. ప్రజలకూ ప్రభుత్వానికీ వారధిగా ఉండాల్సిన ప్రజా సంబంధాల అధికారుల పాత్ర మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందని సూచించారు. ప్రస్తుత మీడియా మార్పులకు అనుగుణంగా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాతో పాటు డిజిటల్ మీడియా సమన్వయంతో ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. వేగంగా విస్తరిస్తున్న సోషల్ మీడియాను ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ప్రచారానికి శక్తివంతమైన సాధనంగా వినియోగించాలని అన్నారు.

క్షేత్రస్థాయికి వెళ్లి విజయవంతంగా అమలవుతున్న ప్రభుత్వ పథకాలను ప్రత్యక్షంగా పరిశీలించి, వాటిని ప్రజలకు చేరేలా సృజనాత్మక ప్రచారం చేయాలని ఆదేశించారు. ప్రతి జిల్లాకు సమర్థవంతమైన డీపీఆర్వోలను నియమించాలని, ఇతర విభాగాలలో ఉన్నవారి డిప్యూటేషన్‌లను రద్దు చేయాలని, అర్హులైన ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని, ఈ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని సమాచార శాఖ కమిషనర్‌ను మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి, ఐడిసీ చైర్మన్ మువ్వ విజయబాబు, ఐ&పీఆర్ స్పెషల్ కమిషనర్ సిహెచ్. ప్రియాంక, సీఎం సీపీఆర్వో జి. మల్సూర్ తదితరులు పాల్గొన్నారు.

# యాదగిరిగుట్టలో కొనసాగుతున్న ధనుర్మాసోత్సవాలు

- శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి నిత్యరాబడి రూ.17.49లక్షలు

**జయభేరి, యాదగిరిగుట్ట, డిసెంబర్ 19:**

తెలంగాణ ప్రసిద్ధి క్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం యాదగిరి కొండపై ఉన్న ముఖమండపం ఉత్తర భాగంలోని హాల్‌లో గోదాదేవి అమ్మవారిని వేంచింపజేసి తిరుప్పా కార్యక్రమాన్ని అర్చకులు వేదోక్తంగా నిర్వహించారు. ధనుర్మాసోత్సవాలను పురస్కరించుకొని శ్రీగోదాదేవికి విశేష తిరువారాధన, తిరుప్పావై సేవాకాలము, శాత్తుమొరైని నిర్వహించారు. మహిళా భక్తులు భారీగా తరలివచ్చి అమ్మవారికి మంగళ హారతులు ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.



**యాదగిరీశుడికి నిత్యపూజలు..**

శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారికి నేత్రపర్వంగా నిత్య పూజలు కొనసాగుతున్నాయి. శుక్రవారం తెల్లవారు జామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతం, అర్చనను శాస్త్రోక్తంగా నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనాలకు అనుమతించారు. శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శించుకున్న భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో జరిగిన శ్రీసుదర్శన నారసింహ హోమం,నిత్యకల్యాణం, నిత్యబ్రహ్మోత్సవం,వెండి జోడి సేవ,స్వర్ణ పుష్పార్చన, శ్రీసత్యనారాయణస్వామి వ్రత పూజలలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కొండపైన కొలువైన శ్రీపర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాతగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శించుకొని ఆలయంలో జరిగిన నిత్యపూజలలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**శ్రీనారసింహుడి నిత్యరాబడి..**

శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారికి నిత్యరాబడిలో భాగంగా శుక్రవారం రూ.17,49,812 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ప్రధాన బుకింగ్ ద్వారా రూ.56,000,బ్రేక్ దర్శనం ద్వారా రూ.1,61,400, వీఐపీ దర్శనం ద్వారా రూ.1,80,000, కొండపైకి వాహన ప్రవేశం ద్వారా రూ.2,53,500, సువర్ణ పుష్పార్చన ద్వారా రూ.33,400, ప్రసాద విక్రయం ద్వారా రూ.6,55,150,కల్యాణకట్ట ద్వారా రూ.25,000తో పాటు వివిధ శాఖలు,పాతగుట్ట ఆలయం ద్వారా ఆలయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

# కాంగ్రెస్ అత్యధిక స్థానాలు సాధించేందుకు కృషి చేసిన బీర్ల


- సిఎం రేవంత్ రెడ్డి, బీసి సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, టీపీసీసీ ఛీఫ్ మహేష్‌కుమార్ గౌడ్‌ను కలిసిన బీర్ల అయిలయ్య

**జయభేరి, యాదగిరిగుట్ట:**



తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీసి సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్‌ను డీసీసీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో సిఎం రేవంత్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, మహేష్‌కుమార్ గౌడ్‌ను కలిసి సన్మానించారు. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో ఆలేరు నియోజకవర్గంలో కాంగ్రెస్ అత్యధిక స్థానాలు సాధించేందుకు కృషి చేసిన బీర్ల అయిలయ్యను సి ఎం రేవంత్ రెడ్డి,పొన్నం ప్రభాకర్,మహేష్‌కుమార్ గౌడ్ అభినందించారు.





కాంగ్రెస్ పార్టీ కోసం బీర్ల అయిలయ్య నిరంతరం కృషి చేస్తున్నాడని, ఆలేరు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ మరింత పటిష్టంగా మారిందని తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం నేతలు,కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని, రానున్న అన్ని ఎన్నికల్లో పార్టీ గెలిచేలా కృషి చేయాలని సిఎం రేవంత్ రెడ్డి, మహేష్‌కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. అనంతరం యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి లడ్డు ప్రసాదాన్ని సిఎం రేవంత్ రెడ్డి,పొన్నం ప్రభాకర్, మహేష్ కుమార్‌గౌడ్‌కు బీర్ల అయిలయ్య అందజేశారు.

# సమరసత సేవా ఫౌండేషన్ ధనుర్మాస లో మేలుకొలుపు కార్యక్రమం

**జయభేరి, పరవాడ:**




సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నాయుడు పాలెం పంచాయతీ సిమ్మన్నగారుఊరు గ్రామంలో శ్రీ శివాలయం దేవాలయం కేంద్రంగా నాలుగో రోజు మేలుకొలుపు కార్యక్రమం చేయడం జరిగింది. ఈ సందర్భంగా పరవాడ సబ్ డివిజన్ ధర్మప్రచారక్ వెన్నల అప్పలనాయుడు మాట్లాడుతూ.. పరవాడ మండలం అన్ని గ్రామాల్లో దేవాలయ కేంద్రంగా మేలుకొలుపు కార్యక్రమం గ్రామ పెద్దలు దేవాలయం కమిటీ సభ్యులు గ్రామాలలో భక్తులందరూ ధనుర్మాసం సందర్భంగా భగవంతుని పల్లకిలో ఊరేగిస్తే భగవంతుడు హరినామ స్మరణ చేస్తే వీధి లో ఊరోగిస్తూ ప్రతి కుటుంబాన్ని మేలుకొలుపుతూ భగవంతుడే తమ దగ్గరికి వచ్చినట్టుగా భక్తులందరూ దర్శనం చేసుకుంటారు అన్నారు. యువతీ యువకుల్లో భక్తి భావన పెంపొందేలా, దేవాలయానికి వచ్చేలాగా కుటుంబ సభ్యులు, పెద్దలు, ధార్మిక సభ్యులు, భజన గురువులు దేవాలయానికి వచ్చేటట్టుగా కృషి చేయాలి.

భగవంతుడి నామం చేయడం వల్ల మనుషుల్లో అనేక రోగాలు నయమవుతాయనీ అన్నారు. భక్తుల్లో మంచి పరివర్తన సమాజ పట్ల గౌరవం భగవంతుడుపై భక్తిశ్రద్ధలు ఏర్పడతాయనీ అన్నారు.ఈ మేలుకొలుపులు కార్యక్రమం వలన గ్రామాల్లో ప్రజల్లో చైతన్యం పెరిగి కలిసికట్టుగా అందరు కలిసి పని చేస్తే ఏపనినైనా చేయగలమని భావన కలుగుతుందని అని అన్నారు. ఈకార్యక్రమంలో ధార్మిక జట్టు సభ్యులు, గ్రామ పూజారి కూండ్రపు అప్పలనాయుడు ఆర్ టి సి, మాతృమూర్తులు, పెద్దలు, యువకులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# యూరియా బుకింగ్ కోసం మొబైల్ యాప్ పై అవగాహన

**జయభేరి, తుర్కపల్లి, డిసెంబర్ 19 :**



తుర్కపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం యూరియా బుకింగ్ కోసం మొబైల్ యాప్ పై అవగాహన కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో శ్రీ ఉమా మాట్లాడుతూ యూరియాను ఇప్పటినుండి రైతులు స్లాట్ బుక్ చేసుకొని ఎటువంటి ఇబ్బంది పడకుండా ప్రభుత్వం ఫర్టిలైజర్స్ యాప్ను ప్రవేశ పెట్టిందని, ఈ యాప్ ద్వారా రైతులు ముందస్తుగా యూరియాను బుక్ చేసుకుని యూరియా సంచులను కొనగలరని అన్నారు మన జిల్లాలో ఎక్కడైనా స్లాట్ బుక్ చేసుకోవచ్చని, స్లాట్ బుక్ అయిన తేదీ నుండి 24 గంటల లోపే ఆ యూరియా షాపులకు వెళ్లి కొనుక్కోవచ్చని అన్నారు.

వారికి ఒక్క విడతలోనే మొత్తం యూరియాను తీసుకోవచ్చని, ఒక ఎకరం నుండి 5 ఎకరాల లోపు ఉన్నరైతులు రెండు విడతల్లో, ఐదు నుండి 20 ఎకరాలు ఉన్న రైతులు మూడు విడతల్లో, 20 ఎకరాల పైన ఉన్నవారు 4 విడతల్లో తీసుకోవచ్చని అన్నారు. ఈ యాప్ ద్వారా రైతులు సులువుగా యూరియాను విక్రయించుకోవచ్చని యూరియా బస్తాల కోసం షాపుల ముందు లైన్ కట్టే ఇబ్బందికరమైన పరిస్థితి నుండి విముక్తి పొందినట్లు తెలిపారు.

ఈ యాప్ లో పట్టాదారులే కాకుండా కౌలు రైతులు కూడా ఉపయోగించుకోవచ్చు అని అన్నారు. రైతులందరూ ఈ యాప్ ను ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.




# పవన్ కార్ గిఫ్ట్.. సుజిత్ రియాక్షన్...

**జయభేరి, హైదరాబాద్, డిసెంబర్ 19:**

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ రీసెంట్‌గా 'OG' డైరెక్టర్ సుజీత్‌కు ఖరీదైన ల్యాండ్ రోవర్ డిఫెండర్ కారు గిఫ్ట్ ఇచ్చిన సంగతి తెలిసిందే. తన అభిమాన హీరోతో బ్లాక్ బస్టర్ తీసినందుకే ఈ కాస్ట్‌లీ గిఫ్ట్ ఇచ్చారని అంతా భావించారు. కానీ అసలు రీజన్ వేరే ఉంది.

ఓ సగటు పవర్ స్టార్ అభిమాని పవన్‌ను సిల్వర్ స్క్రీన్‌పై ఎలా చూడాలని అనుకున్నాడో... ఓ వీరాభిమానిగా అలానే 'OG'లో చూపించారు డైరెక్టర్ సుజీత్. సినిమాలో పవన్ యాక్షన్, జోష్‌ను ఫ్యాన్స్ ఎప్పటికీ మర్చిపోలేరు. బాక్సాఫీస్ బరిలో ఈ మూవీ రూ.300 కోట్లకు పైగా కలెక్షన్స్ సాధించింది. ఇంతటి సక్సెస్ అందించినందుకే డైరెక్టర్‌కు పవన్ ఖరీదైన కారు గిఫ్ట్‌గా ఇచ్చారని అంతా అనుకున్నారు. కానీ, అసలు కారణం అది కాదు.'OG' షూటింగ్ చివరి దశలో ఓ కీలకమైన షెడ్యూల్ జపాన్‌లో షూట్ చేయాల్సి వచ్చింది. అయితే, బడ్జెట్ పరిమితుల కారణంగా చిత్ర నిర్మాణ సంస్థకు ఈ షెడ్యూల్ చేయడం సాధ్యపడలేదు. అయితే, జపాన్‌లో ఆ సీన్స్ తీస్తేనే 'OG' మూవీకి కంప్లీట్‌నెస్ వస్తుందని డైరెక్టర్ సుజీత్ భావించాడు. ఈ క్రమంలో బడ్జెట్ కోసం తన సొంత ల్యాండ్ రోవర్ డిఫెండర్ అమ్మేశాడు. అలా వచ్చిన డబ్బుతో జపాన్‌కు వెళ్లి అవసరమైన లొకేషన్స్ షూట్ చేసుకుని వచ్చాడు.ఇక, డబ్బింగ్ దశలో పవన్ కల్యాణ్‌కు డైరెక్టర్ సుజీత్ ఇలా చేసినట్లు తెలిసింది. సినిమా పట్ల డైరెక్టర్ సుజీత్‌కు ఉన్న అంకితభావం, ఇష్టం, బాధ్యత, డెడికేషన్ పవర్ స్టార్‌ను ఆకట్టుకున్నాయి. సినిమా కోసం తన సొంత వెహికల్‌నే అమ్మేసిన విషయం తెలుసుకున్న పవన్... అదే మోడల్, ల్యాండ్ రోవర్ డిఫెండర్‌ను డైరెక్టర్‌కు గిఫ్ట్‌గా అందించారు. ఈ కారు ఖరీదు రూ.3 కోట్లు అని తెలుస్తోంది. ఈ విషయం తెలుసుకున్న ఫ్యాన్స్ 'దటీజ్ పవన్ కల్యాణ్' అంటూ కామెంట్స్ చేస్తున్నారు. పవన్ తనకు కారు గిఫ్ట్‌గా ఇచ్చిన విషయాన్ని స్వయంగా డైరెక్టర్ సుజీత్ సోషల్ మీడియా వేదికగా వెల్లడించాడు. దీనికి సంబంధించి 3 ఫోటోలను ఇన్ స్టాలో షేర్ చేశారు. 'మాటలకు అందని అద్భుతమైన సందర్భం ఇది. ఇప్పటివరకూ అందుకున్న బహుమతుల్లో ఇదే బెస్ట్ గిఫ్ట్. నాకు ఎంతో ఇష్టమైన పవన్ కల్యాణ్ గారి నుంచి లభించిన ప్రేమను మాటల్లో చెప్పలేను. నా చైల్డ్ హుడ్ డేస్ ఆయన అభిమాని నుంచి ఇప్పటివరకూ ప్రతిదీ ఎంతో స్పెషల్ మూమెంట్. ఎప్పటికీ ఆయనకు రుణపడి ఉంటాను.' అంటూ రాసుకొచ్చారు.ప్రస్తుతం పవన్ కల్యాణ్, డైరెక్టర్ హరీష్ శంకర్ కాంబో 'ఉస్తాద్ భగత్ సింగ్' రిలీజ్‌కు రెడీగా ఉంది. మరోవైపు 'OG' సీక్వెల్, ప్రీక్వెల్ ఉంటాయని ముందే అనౌన్స్ చేశారు. 'OG' సీక్వెల్ సిద్ధం చేసే పనిలో సుజీత్ ఉన్నారు.

# కందికల్ లో ఉద్రిక్తత

**జయభేరి, రంగారెడ్డి :**

బండ్లగూడ విలేజ్ కందికల్ గ్రామం లో సర్వే నెంబర్ 310/1/2 లో 9.11 గుంటలు చెరువు స్థలం కబ్జా అయిందని స్థానికులు ఆరోపించారు. రెండు ఎకరాలు ఇప్పటికే కబ్జా అయిందని అన్నారు. దాంతో హైడ్రా 7 ఎకరాల చెరువు స్థలం రక్షించడానికి రంగం లోకి దిగింది. మిగిలిన 7ఎకరాల చెరువు స్థలం అని హైడ్రా చుట్టురా ఫెన్సింగ్ వేసింది. అయితే కొంతమంది ఇది పట్టా ల్యాండ్ అంటు అడ్డుకున్నారు. ఆ ల్యాండ్ తమదంటే తమదని పలువురు ముందుకు వచ్చారు. గతంలో పట్టా ల్యాండ్ అని కబ్జా చేయడానికి పోజీషన్ మీదికి వచ్చిన ఓ వ్యక్తికి కోటి రూపాయల జరిమానా విధించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో అక్కడ భారీగా హైడ్రా, పోలీసులు రీగా మోహరించారు.





# బుర్ఖా ధరించలేదని.. చంపి ఇంట్లో పాతేశాడు

**జయభేరి, లక్నో, డిసెంబర్ 19:**

బుర్ఖా ధరించలేదనే కోపంతో ఓ వ్యక్తి తన భార్యను, అడ్డువచ్చిన ఇద్దరు మైనర్ కుమార్తెలను అతి కిరాతకంగా చంపి, ఇంటి ప్రాంగణంలోనే పాతిపెట్టిన ఘటన కలకలం రేపింది. ఈ హృదయవిదారక ఘటన ఉత్తరప్రదేశ్‌లోని షామ్లీ జిల్లాలో వెలుగుచూసింది. వంటవాడిగా పనిచేసే ఫరూఖ్ అనే వ్యక్తికి అత్యంత ఛాందసభావాలు ఉన్నాయి. తన భార్య తాహిరా ఎప్పుడూ బుర్ఖా ధరించాలని అతను వేధించేవాడు. కేవలం ఫోటో కనిపిస్తుందనే కారణంతో గత 18 ఏళ్లుగా ఆమెను ఆధార్ కార్డు, రేషన్ కార్డు వంటి కనీస గుర్తింపు పత్రాలు కూడా తీసుకోనివ్వలేదు. తన మామ ఇంటికి వచ్చినా కూడా భార్యను కలవనిచ్చేవాడు కాదు.భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. అయితే, నెల క్రితం తాహిరా బుర్ఖా ధరించకుండా తన పుట్టింటికి వెళ్లిందని ఫరూఖ్ తెలుసుకున్నాడు. ఇది తన గౌరవానికి భంగమని భావించిన అతను, డిసెంబర్ 10వ తేదీ అర్ధరాత్రి వంటగదిలో ఉన్న తాహిరాను పిస్టల్‌తో కాల్చి చంపాడు. తుపాకీ శబ్దం విని నిద్రలేచిన పెద్ద కుమార్తె అఫ్రీన్ వంటగదిలోకి రావడంతో సాక్ష్యం లేకుండా చేసేందుకు ఆమెను కూడా కాల్చి చంపాడు. మరో కుమార్తె సెహ్రీన్ కూడా అక్కడికి రావడంతో ఆమె గొంతు కోసి హతమార్చాడు. అనంతరం ఇంటి ప్రాంగణంలో టాయిలెట్ కోసం తవ్విన 9 అడుగుల గోతిలో ముగ్గురి మృతదేహాలను పాతిపెట్టి, ఎవరికీ అనుమానం రాకుండా దానిపై ఇటుకల నేలను నిర్మించాడు.తాహిరా, పిల్లలు ఆరు రోజులుగా కనిపించకపోవడంతో ఫరూఖ్ తండ్రి దావూద్‌కు అనుమానం వచ్చింది. వారి గురించి అడిగినప్పుడల్లా ఫరూఖ్ సమాధానం దాటవేసేవాడు. చివరకు తన కుమారుడే ఏదో చేసి ఉంటాడని అనుమానించిన దావూద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రంగంలోకి దిగిన పోలీసులు ఫరూఖ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా ఈ ఘోర నేరాన్ని అంగీకరించాడు.నిందితుడి ఒప్పుకోలుతో పోలీసులు హత్యకు ఉపయోగించిన పిస్టల్, ఏడు ఖాళీ గుండ్లు మరియు 10 లైవ్ కార్ట్రిడ్జ్‌లను స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం నిందితుడు పోలీసుల కస్టడీలో ఉన్నాడు. భార్యను, పసిబిడ్డలను అతి దారుణంగా పొట్టనబెట్టుకున్న ఈ కిరాతకుడి ఉదంతం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

# 24న గద్దెల ప్రతిష్ఠాపన



**జయభేరి, వరంగల్ , డిసెంబర్ 19:**

ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా మేడారానికి పేరు ఉంది. ఈ జాతర ఫిబ్రవరిలో ప్రారంభం కానుంది. ఈసారి జాతరకు దాదాపు 10 లక్షల మించి భక్తులు వస్తారని తెలంగాణ ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఈ నేపథ్యంలో వచ్చే భక్తుల తగ్గట్టుగా సౌకర్యాలు ఏర్పాటు చేస్తోంది. గత ప్రభుత్వాలు తాత్కాలికంగా అభివృద్ధి పనులు చేపడితే, ఈసారి కాంగ్రెస్ ప్రభుత్వం శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టేందుకు రంగం సిద్ధం చేసింది. ఇందులో భాగంగా వందల కోట్ల ఖర్చుతో శాశ్వత నిర్మాణాలను ఏర్పాటు చేస్తోంది.మేడారం సమ్మక్క సారలమ్మ మహా జాతర వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరుగుతుంది. ఈ క్రమంలో ఈ జాతరను పురస్కరించుకొని శాశ్వతమైన పనులను ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వం చేపట్టింది.. ఆలయ విస్తరణ పనులను ముమ్మరంగా చేపడుతోంది. గద్దల ముందు రాతి స్తంభాలతో ప్రధాన ద్వారాన్ని ఏర్పాటు చేశారు.. ఇందుకోసం ఎనిమిది భారీ స్తంభాలను ఏర్పాటు చేశారు. ప్రతి రాతి స్తంభం మీద ఆదివాసీల చరిత్రను తెలిపే విధంగా బొమ్మలను రూపొందించారు. ప్రస్తుతం ఒకే వరుసలో గద్దెల నిర్మాణ పనులు జరుగుతున్నాయి.. మరి కొద్ది రోజుల్లో ఈ పనులు పూర్తికాబోతున్నాయి.. ఈనెల 24న పూజారుడు గోవిందరాజులు, పగిడిద్దరాజుల గద్దెలను ప్రతిష్ఠాపన చేస్తానని తెలుస్తోంది.మేడారం ఆలయ అభివృద్ధి పనులను తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టింది. ఈ పనులకు స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వచ్చి శంకుస్థాపన చేశారు. దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, జిల్లా ఇన్ఛార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, స్థానిక శాసనసభ సభ్యురాలు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క ఎప్పటికప్పుడు ఈ పనులను పర్యవేక్షిస్తున్నారు. పనుల్లో నాణ్యత ఉండేలా చూస్తున్నారు. ఈ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయడానికి శిల్పులు, కార్మికులు, ఇంజనీర్లు శ్రమిస్తున్నారు. తద్వారా మేడారానికి సరికొత్త రూపు వచ్చే విధంగా చమటోడ్చుతున్నారు.

మేడారం.. ఆదివాసీలకు ఇలవేల్పు అయిన సమ్మక్క సారలమ్మకు ప్రధాన ఆలయం. ఇది ఆసియాలోనే గిరిజనులు జరుపుకునే అతిపెద్ద జాతర. ఈ జాతరకు లక్షలలో భక్తులు వస్తారని ప్రభుత్వం భావిస్తోంది. అందుకు తగ్గట్టుగానే సౌకర్యాలు కల్పిస్తోంది. వందల సంఖ్యల పోలీసులను.. అంతే స్థాయిలో ఆర్టీసీ బస్సులను.. ఇతర ప్రభుత్వ శాఖలకు సంబంధించిన సిబ్బందిని భక్తుల సేవలో తరించడానికి సర్కార్ నియమించనుంది. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి మేడారం జాతర వస్తుంది. అయితే ఇప్పుడు సోషల్ మీడియా వినియోగం.. మీడియా విస్తృతి పెరిగిన తర్వాత మేడారం జాతర ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకునే అవకాశం ఉందని ఇక్కడి భక్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# విద్యార్థిని బ్లాక్‌మెయిల్ చేసి ఆమెపై ముగ్గురూ అత్యాచారం

**జయభేరి, బెంగళూరు డిసెంబర్ 19 :**

కాలేజీ యువతిని ప్రేమ పేరుతో ఒక విద్యార్థి లోబర్చుకున్నాడు. అతడి స్నేహితులు దీనిని రికార్డ్ చేశారు. ముగ్గురూ బ్లాక్‌మెయిల్ చేసి ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డారు. బాధిత యువతి ఫిర్యాదుతో పోలీసులు వారిని అరెస్ట్ చేశారు. కర్ణాటక రాజధాని బెంగళూరులో ఈ సంఘటన జరిగింది. మాగడి ప్రాంతానికి చెందిన 19 ఏళ్ల యువతి కాలేజీలో చదువుతున్నది. ఆరు నెలల కిందట కాలేజీ స్టూడెంట్ వికాస్‌తో ఆమెకు పరిచయం ఏర్పడింది.కాగా, ప్రేమ పేరుతో ఆ యువతిని వికాస్ లోబర్చుకున్నాడు. అతడి ఫ్రెండ్ ప్రశాంత్ ఇంటికి ఆమెను పలుమార్లు తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. మరో స్నేహితుడు చేతన్ దీనిని రికార్డ్ చేశాడు. ఆ ముగ్గురూ కలిసి సెప్టెంబర్ నుంచి ఆమెను బ్లాక్‌మెయిల్ చేశారు. తాము కోరినప్పుడల్లా ఆ రూమ్‌కు రావాలని బెదిరించారు. గత రెండు నెలలుగా ఆమెపై అత్యాచారానికి పాల్పడుతున్నారు.మరోవైపు వారి లైంగిక వేధింపులను ఆ యువతి భరించలేకపోయింది. డిసెంబర్ 17న పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఆ యువతికి తెలిసిన ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు పోలీస్ అధికారి తెలిపారు. నిందితుల్లో ఇద్దరు విద్యార్థులని వెల్లడించారు.



# సంక్రాంతి బరిలో సంపూర్ణ వినోదం

మెగాస్టార్ నటన గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఎలాంటి పాత్రనైనా తనదైన అభినయంతో రక్తికట్టిస్తారు. కామెడీని పండించడంలోనూ ఆయన దిట్ట. అయితే గత కొంతకాలంగా మాస్, యాక్షన్ కథలకు ప్రాధాన్యతనిస్తున్న ఆయన వినోదానికి దూరమయ్యారని అభిమానుల్లో కొంచెం అసంతృప్తి ఉంది. ఇప్పుడాలోటుని తీర్చడానికి 'మన శంకరవరప్రసాద్‌గారు'తో ప్రేక్షకుల ముందుకొస్తున్నారు మెగాస్టార్ చిరంజీవి. ఈ సినిమాలో ఆయన తనదైన వింటేజ్ కామెడీతో అభిమానుల్లో జోష్ నింపబోతున్నారు. సంక్రాంతి కానుకగా జనవరి 12న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకురానుంది. ఇప్పటికే విడుదలైన పాటలు, ప్రచార చిత్రాలు సినిమాపై భారీ హైప్‌ని క్రియేట్ చేశాయి. చిరంజీవి స్వాగ్, దర్శకుడు అనిల్ రావిపూడి తనదైన మార్క్ కామెడీ కలబోతగా ఈ సినిమా సంక్రాంతి బరిలో వినోదాల విందు చేయనున్నదని మేకర్స్ చెబుతున్నారు. అన్నింటికంటే ముఖ్యంగా ఈ సినిమా కోసం చిరు మేకోవర్ చూసి అభిమానులు ఖుషీగా ఉన్నారు. యంగ్ లుక్‌తో సరికొత్త ఛరిష్మాతో చిరంజీవి కనిపిస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం ఆయన స్టిల్‌స్‌ని విడుదల చేశారు. ఇందులో తనదైన మ్యాజికల్ ప్రజెన్స్‌తో ఆకట్టుకుంటున్నారు. అగ్ర హీరో వెంకటేష్ అతిథి పాత్ర ఈ సినిమాకు ప్రత్యేకాకర్షణగా నిలవనుంది. ఈ చిత్రానికి కెమెరా: సమీర్ రెడ్డి, సంగీతం: భీమ్స్ సిసిరోలియో, రచనదర్శకత్వం: అనిల్ రావిపూడి.

# నాలుగో 'ఇడియట్' కోసం



స్నేహం గొప్పతనాన్ని ఆవిష్కరిస్తూ, మన విద్యా వ్యవస్థలోని లోపాలను చర్చిస్తూ సందేశాత్మకంగా రూపొందిన 'త్రీ ఇడియట్స్' చిత్రం తిరుగులేని ఆదరణ సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. అమీర్‌ఖాన్, ఆర్.మాధవన్, శర్మాన్ జోషి, కరీనా కపూర్ ప్రధాన పాత్రల్లో రాజ్‌కుమార్ హీరానీ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా 2009లో విడుదలై బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచింది. తాజాగా ఈ చిత్రానికి సీక్వెల్ తెరకెక్కించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. దీనికి '4 ఇడియట్స్' అనే టైటిల్‌ను ఖరారు చేయబోతున్నారని సమాచారం. అమీర్‌ఖాన్, ఆర్.మాధవన్, శర్మాన్‌జోషి సీక్వెల్‌లో కొనసాగుతారని, ఈ త్రయానికి మరో అగ్ర హీరో జత కలుస్తారని బాలీవుడ్ టాక్. ప్రస్తుతం ఆ నాలుగో 'ఇడియట్' అన్వేషణలో చిత్రబృందం ఉందని తెలిసింది. ఈ ఫ్రాంఛైజీని లార్జర్ స్కేల్‌లో రూపొందించేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారట. తొలిభాగంలో విద్యా వ్యవస్థ గురించి చర్చించగా, ఈ సీక్వెల్‌లో మరో సామాజికాంశాన్ని ప్రధాన కథా వస్తువుగా తీసుకోబోతున్నారని సమాచారం. వచ్చే ఏడాది ప్రథమార్థంలో ఈ సీక్వెల్ సెట్స్‌పైకి వెళ్లనుందని వార్తలొస్తున్నాయి.



# ఇండస్ట్రీలో అయినా నాకు గురువు..


సమంత, నాగ చైతన్యను వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. ఆ తర్వాత మన స్పర్థల కారణంగా విడిపోయారు. ఇక విడిపోయిన తర్వాత సమంత, నాగ చైతన్య ఎవరి లైఫ్‌లో వారు బిజీగా ఉన్నారు. ఇదిలా ఉంటే సమంత మాయోసైటిస్ కారణంగా ఏడాది పాటు సినిమాలకు బ్రేక్ తీసుకుంది. ఇక ఇప్పుడు తిరిగి సినిమాల్లో నటించడానికి రెడీ అవుతుంది. ఇదిలా ఉంటే సమంత గతంలో చేసిన కొన్ని కామెంట్స్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి. టాలీవుడ్ లో తనకు ఓ స్టార్ హీరో గురువు అని తెలిపింది సామ్. టాలీవుడ్ లో సమంత చాలా మంది స్టార్ హీరోల సరసన నటించింది. మహేష్ బాబు, ఎన్టీఆర్, అల్లు అర్జున్ ఇలా చాలా మంది స్టార్ హీరోలతో నటించింది. అలాగే పవర్ స్టార్ పవన్ కళ్యాణ్‌తోనూ సినిమా చేసింది సమంత. పవన్ కళ్యాణ్ తో అత్తారింటికి దారేది సినిమా చేసింది. త్రివిక్రమ్ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమా సూపర్ హిట్ గా నిలిచింది. ఈ సినిమాలో పవన్ కు జోడీగా సామ్ నటించి మెప్పించింది. అలాగే గతంలో ఓ ఇంటర్వ్యూలో సమంత మాట్లాడుతూ.. ఈ చిత్రంలో పవన్ తో మంచి సాన్నిహిత్యం ఏర్పడిందని సమంత తెలిపింది. అలాగే షూటింగ్ సమయంలో తీసిన ఓ ఫోటో సోషల్ మీడియాలో తెగ వైరల్ అయ్యింది. ఆ ఫొటోలో సమంతను పవన్ ఆశీర్వదిస్తూ కనిపించారు. దీని గురించి సమంత మాట్లాడుతూ.. పవన్ నా గురువుగారు అని చెప్పింది. స్విట్జర్లాండ్ లో షూటింగ్ జరుగుతున్నప్పుడు సరదాగా తీసిన ఫోటో అది అని.. పవన్ కళ్యాణ్ నటుడు కాకపోయి ఉంటే నాకు గురువుగా ఉండమని కోరేదాన్ని అంటూ సమంత తెలిపింది.



# హిట్ కోసం ఎదురుచూస్తున్న బ్యూటీ..

క్రమంగా ఇండస్ట్రీలో కనిపించకుండాపోతారు.. కానీ ఈ హీరోయిన్ రూటే సపరేట్. 20ఏళ్లుగా ఒక్క హిట్ అందుకోలేకపోయింది.. ఇరవై ఏళ్లకు పైగా సినీ ఇండస్ట్రీలో ఉంది ఈ ముద్దుగుమ్మ. అలాగే ఇరవై ఏళ్లుగా హిట్స్ మాత్రం అందుకోలేకపోయింది. కానీ ఆమె క్రేజ్ మాత్రం ఎక్కడ తగ్గలేదు. అందంలో అప్సరస.. గ్లామర్ డోస్ కూడా ఎక్కువే.. కానీ అదృష్టం మాత్రం దక్కలేదు ఈ చిన్నదానికి.. ఇంతకూ ఆమె ఎవరంటే.. బాలీవుడ్ ముద్దుగుమ్మ చిత్రాంగదా సింగ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. 2005లో హజారోన్ ఖ్వాహిష్ ఐసీ అనే క్రైమ్ డ్రామాతో సినీ రంగంలోకి అడుగు పెట్టింది. మోడలింగ్ నుంచి హీరోయిన్ గా మారింది ఈ చిన్నది. హీరోయిన్ గానే కాదు నిర్మాతగానూ చేసింది. 2018లో సూర్మా అనే స్పోర్ట్స్ డ్రామాకు నిర్మాతగా వ్యవహరించింది. ఇటీవలే హౌస్‌ఫుల్ 5 సినిమాలోనూ కనిపించింది ఈ ముద్దుగుమ్మ. సినీ కెరీర్ లో చిత్రాంగదా సింగ్ తొమ్మిదేళ్ల పాటు సినిమాలకు దూరంగా ఉంది. ఆ సమయంలో ఎన్నో బ్లాక్ బస్టర్ హిట్స్ మిస్ చేసుకుంది. అలాగే ఇటీవల ఆమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. ఆసక్తికర కామెంట్స్ చేసింది. కెరీర్ లో నేను ఎన్నో తప్పులు చేశాను. నేను ఎన్నో బ్లాక్ బస్టర్ సినిమాలను మిస్ చేసుకున్నా.. గ్యాంగ్‌స్టర్ సినిమా నేను రిజెక్ట్ చేశా.. అంతే కాదు తను వెడ్స్ మను సినిమాను కూడా నేను మిస్ చేసుకున్నా.. మంగల్ పాండే'లో అమీషా పటేల్ చేసిన పాత్రను కూడా నేను రిజెక్ట్ చేశా.. అని తెలిపింది.

# 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' టీజర్ రిలీజ్..



మాస్ మహారాజ్ రవితేజ హీరోగా తెరకెక్కుతున్న లేటెస్ట్ మూవీ 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని క్రియేట్ చేస్తోంది. SLV సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మాణంలో, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్స్‌కు పేరున్న దర్శకుడు కిశోర్ తిరుమల ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. డింపుల్ హయతి, ఆషిక రంగనాథ్ హీరోయిన్లుగా నటిస్తుండగా, సినిమా మొత్తం ఎంటర్‌టైన్‌మెంట్‌పై గట్టి ఫోకస్ పెట్టినట్లు ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ చెబుతోంది.ఇప్పటికే ఈ సినిమా నుంచి గ్లింప్స్, పాటలు రిలీజ్ అయి పాజిటివ్ రెస్పాన్స్ తెచ్చుకున్నాయి. తాజాగా మేకర్స్ టీజర్‌ను విడుదల చేయగా, ఇది సోషల్ మీడియాలో వేగంగా వైరల్ అవుతోంది. టీజర్ చూస్తే, రవితేజ క్యారెక్టర్ చుట్టూ తిరిగే ఫుల్ టెన్షన్ కామెడీకి సినిమా సిద్ధమవుతోందన్న విషయం స్పష్టంగా తెలుస్తోంది. టీజర్‌లో హీరోకు భార్య ఉండగానే మరో అమ్మాయి జీవితంలోకి రావడం, ఒకరికి తెలియకుండా మరొకరితో ఎలా వ్యవహరించాల్సి వస్తుందో, ఆ క్రమంలో హీరో ఇద్దరి మధ్య ఎలా నలిగిపోతాడో సరదాగా చూపించారు. ఒక చిన్న పొరపాటు నుంచి మొదలయ్యే పరిస్థితులు ఎలా పెద్ద సమస్యలుగా మారతాయన్న పాత సూపర్ హిట్ ఫార్ములాను, రవితేజ స్టైల్ కామెడీ టైమింగ్‌తో కొత్తగా ప్రెజెంట్ చేసినట్లు టీజర్‌లో కనిపిస్తోంది. డబుల్ రోల్ టెన్షన్, అపార్థాలు, దాచిపెట్టే ప్రయత్నాలు, అనుకోని ట్విస్టులతో సినిమా మొత్తం నవ్వులు పూయించబోతుందన్న హింట్ టీజర్ ఇస్తోంది.

రవితేజ ఎనర్జీ, కామెడీ టైమింగ్ మరోసారి ఈ సినిమాకు ప్రధాన బలంగా నిలవబోతుందని అభిమానులు అంటున్నారు. డింపుల్ హయతి, ఆషిక రంగనాథ్ పాత్రలు కూడా కథలో కీలకంగా ఉండబోతున్నాయని, ఇద్దరి మధ్య హీరో ఇరుక్కునే సన్నివేశాలు ప్రేక్షకులను బాగా ఎంటర్‌టైన్ చేస్తాయని టీజర్ ద్వారా అర్థమవుతోంది. కిశోర్ తిరుమల గతంలో తెరకెక్కించిన ఫ్యామిలీ డ్రామాలు, రిలేషన్‌షిప్ ఆధారిత కథల అనుభవం ఈ సినిమాకు అదనపు ప్లస్‌గా మారనుంది. సినిమా టెక్నికల్ అంశాల పరంగా కూడా మంచి క్వాలిటీ కనిపిస్తోంది. బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్, ఎడిటింగ్, విజువల్స్ అన్నీ టీజర్‌లో బాగానే వర్క్ అయ్యాయి. ముఖ్యంగా కామెడీ సీన్స్‌కు సరైన పేస్ సెట్ చేసిన విధానం సినిమాపై అంచనాలు పెంచుతోంది.'భర్త మహాశయులకు విజ్ఞప్తి' సినిమాను మేకర్స్ సంక్రాంతి కానుకగా జనవరి 13న థియేటర్లలో విడుదల చేయనున్నారు. పండుగ సీజన్‌లో ఫ్యామిలీ ఆడియెన్స్‌ను టార్గెట్ చేస్తూ వస్తున్న ఈ టెన్షన్ కామెడీ ఎంటర్‌టైనర్, రవితేజ కెరీర్‌లో మరో హిట్‌గా నిలుస్తుందేమో చూడాలి.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314.** email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**